www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

JOURNALISTS WANTED

- Aashwi Updates – Voice of the People
- Telangana & Andhra Pradesh
- District Bureau: Degree mandatory
- Mandal Reporters: Intermediate mandatory
- News writing & reporting skills required
- Interest in public issues preferred
- Honorarium: Based on experience & performance
- Join Aashwi Updates. Be the Voice of the People!

editor@aashwi.in
7207282727 | 72707292727



ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు 5

గురువారం, 29-10-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :164 Issue : 164 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in



ఎల్‌నినో కరువుపై భట్టి అఖిలపక్ష భేటీ

- కేంద్రానికి నివేదిక పంపించాము
- అవసరమైతే అఖిలపక్షంతో దిల్లీకి వెళ్లి సాయం సాధిస్తాం
- అఖిలపక్ష నేతల సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 28, ఆశ్వి అప్డేట్స్ : ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజా ప్రభుత్వం అన్ని ముందస్తు జాగ్రత్తలు, చర్యలను తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపామని, అవసరమైన సమయంలో అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని దిల్లీకి తీసుకెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి రావాల్సిన సహాయంపై విజ్ఞప్తి చేస్తామని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని పార్టీల సూచనలను పరిగణనలోకి తీసుకుని సమష్టి కార్యాచరణతో ముందుకు వెళ్తామన్నారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ

మిగతా 2వ పేజీలో..



తాగునీటి వృథాకు చెక్..

- ట్రీటెడ్ వాటర్ తప్పనిసరి
- నవంబర్ 1 నుంచి మార్గదర్శకాల అమలుకు ఆదేశాలు
- ఎస్‌టీపీలకు ఏఐ సాంకేతికత.. కమాండ్ కంట్రోల్ పర్యవేక్షణ
- ప్రభుత్వ కార్యాలయాలు, ఓఆర్ఆర్ పరిధిలో శుద్ధి చేసిన నీటి వినియోగం
- భవన నిర్మాణ అనుమతుల్లోనూ ప్రత్యేక నిబంధనలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



2

హైదరాబాద్‌లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

- ఎల్‌నినో నేపథ్యంలో నీటి నిల్వలపై నిరంతర పర్యవేక్షణ
- క్యూర్ పరిధిలో ఎస్టీపీలు వంద శాతం సామర్థ్యంతో పనిచేయాలి
- పార్కులు, రోడ్లు, నిర్మాణాలకు శుద్ధి చేసిన నీరే వాడాలి
- ట్రీటెడ్ వాటర్ సరఫరాకు టోల్‌ఫ్రీ నంబర్

2

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష

ప్రజాస్వామ్యం ఊసెత్తే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

- రైళ్ల కేటాయింపులో కేంద్రం వివక్ష తగదు
- అక్కడ నిరసనలకు ఆటంకం.. ఇక్కడ పాదయాత్రలు
- బీజేపీ తీరుపై మంత్రి పొంగులేటి ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబర్ 28, ఆశ్వి అప్డేట్స్ : ప్రజాస్వామ్యం, నిరసన తెలిపే హక్కుల గురించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు తమ పాలనలో అనుసరించిన విధానాలను గుర్తు చేసుకోవాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. గతంలో నిరసనలు, ధర్నాలకు అవకాశం లేకుండా ఇందిరా పార్కులో ధర్నా చౌక్‌ను ఎత్తివేసిన వారే ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సచివాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం


మిగతా 3వ పేజీలో..



కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు
డీఏ, డీఆర్ నిధులు

- డీఏ, డీఆర్ కోసం రూ.10,016 కోట్లు
- నాలుగు కీలక నిర్ణయాలకు రూ.29,267 కోట్ల కేటాయింపు
- కంటైనర్ తయారీ రంగానికి రూ.10 వేల కోట్లు
- గ్రామీణాభివృద్ధికి రూ.7,395 కోట్లు: కేంద్ర కేబినెట్ నిర్ణయం

3





సీఈసీపై ప్రజా అభిశంసనకు
ఖర్గే నివాసమే వేదిక

- అనుమతుల వివాదంతో కార్యక్రమ స్థలం మార్పు
- 30న ప్రతిపక్షాల ప్రత్యేక కార్యక్రమం
- నవంబర్ 1న దిల్లీలో భారీ సభ
- రామ్‌లీలా మైదాన్ సభకు పోలీసుల షరతులు

5

- సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘం అఫిడవిట్‌పై ప్రతిపక్షాల అభ్యంతరాలు
- కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టిన బీజేపీ

ఎస్ఐఆర్‌పై దుష్ప్రచారానికి వ్యతిరేకంగా
బీజేపీ పాదయాత్ర

- నవంబర్ 2న హైదరాబాద్‌లో మహా పాదయాత్ర

3

- ముఖ్య అతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- కాంగ్రెస్, ఇండీ కూటమి వైఖరిపై నిరసన
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

ఢిల్లీ రైళ్ల కోసం
కాంగ్రెస్ ధర్నా

- ప్రత్యేక రైళ్లకు దక్షిణ మధ్య రైల్వే నిరాకరణ
- రైల్వే నిలయం వద్ద కాంగ్రెస్ నేతల ఆందోళన
- టీపీసీసీ చీఫ్, మంత్రులు, ఎమ్మెల్యేల అరెస్టు
- నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండీ కూటమి ర్యాలీ
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



2

తెలంగాణలో ఐఏఎస్‌ల బదిలీలు

- జయేష్ రంజన్‌కు అటవీ శాఖ బాధ్యతలు
- విద్యుత్ శాఖకు వికాస్ రాజ్
- పంచాయతీరాజ్ శాఖకు నవీన్ మిట్టల్
- జీహెచ్ఎంసీ, ఇతర కార్పొరేషన్లకు ప్రత్యేక అధికారులు

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్: తెలంగాణ ప్రభుత్వంలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా సౌలభ్యం, శాఖల పనితీరు మెరుగుదల లక్ష్యంగా చేపట్టిన

మిగతా 2వ పేజీలో..





కేటీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేయొద్దు


- బల్మూరి, దయాకర్‌లకు సిటీ సివిల్ కోర్టు ఆదేశాలు

3

- కేటీఆర్ వేసిన పరువు నష్టం దావాలో మధ్యంతర ఉత్తర్వులు

నేర పరిశోధనలో డిజిటల్ దూకుడు

- టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్న తెలంగాణ పోలీస్
- 15 సెకన్లలో అనుమానితుల ముఖాల గుర్తింపు
- మొబైల్‌తోనే వేలిముద్రల సరిపోలిక
- 9.8 లక్షలకుపైగా నేరస్థుల ఫొటోలతో డేటాబేస్
- భరోసా కేంద్రాలకు ఏకీకృత సాఫ్ట్‌వేర్..
- ఖైదీలపై ఏఐ నిఘా
- డీజీపీ సి.వి. ఆనంద్ ఏడు డిజిటల్ సేవల ఆవిష్కరణ



2

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సున్నా

- నాలుగు రాష్ట్రాల్లో 28 స్థానాలకు ఎన్నికలు
- 12 స్థానాల్లో పోటీ చేసి ఒక్కటి గెలవని కాంగ్రెస్
- కర్ణాటకలోనూ బీజేపీ–జేడీయూ కూటమిదే విజయం
- బ్యాలెట్ పేపర్ల అంశాన్ని ప్రస్తావించిన ప్రధాని నరేంద్ర మోదీ



5

ఎల్‌నినో కరువుపై భట్టి అఖిలపక్ష భేటీ

మొదటిపేజీ తరువాయి

పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన బుధవారం అఖిల పక్ష సమావేశం జరిగింది. విపత్తు పరిస్థితులను ఎదుర్కొనే సమయంలో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితోనే అన్ని పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించామని తెలిపారు. నేతలు ప్రస్తావించిన అంశాలను నమోదు చేసుకున్నామని, సాధ్యమైన మేరకు వాటిని ప్రభుత్వ కార్యాచరణలో భాగంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంపై గతంలోనూ శాసనసభలో చర్చించామని, వివిధ సమావేశాలు, సదస్సులు నిర్వహించడంతోపాటు శాస్త్రవేత్తలు, నిపుణులతో సంప్రదింపులు జరిపామని వివరించారు. ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రానున్న నెలల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అవసరమైన సన్నద్ధతతో ఉన్నామని పేర్కొన్నారు. వర్షపాతం లోటు ఒక్క తెలంగాణకే పరిమితమైతే పొరుగు రాష్ట్రాల్లో కురిసే వర్షాలతో ప్రాజెక్టులకు నీరు చేరే అవకాశం ఉండేదన్నారు. అయితే రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాలు, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ వర్షపాతం లోటు ఏర్పడటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ప్రత్యామ్నాయ ప్రాంతాల నుంచి నీటి లభ్యత తగ్గిన పరిస్థితుల్లో జలవనరుల నిర్వహణ మరింత కీలకంగా మారిందని చెప్పారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేస్తూ వాటి ప్రభావాన్ని తగ్గించేందుకు శాఖలవారీగా సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తామని, పశువులకు తాగునీరు, మేత అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శాస్త్రవేత్తలు, నిపుణుల సూచనలను పరిగణనలోకి తీసుకుని పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. అఖిలపక్ష నేతలు సూచించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న నీటి అవసరాలను తీర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అఖిలపక్ష నేతలు చేసిన సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలను రూపొందించామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, పశువులకు అవసరమైన నీటి వసతులు కల్పించేందుకు అవసరమైన బడ్జెట్, ఇతర ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సమావేశంలో వచ్చిన సూచనలను పరిశీలించి అమలుకు సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తన పరిధిలో అన్ని చర్యలు చేపడుతూనే కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కూడా సమర్థవంతంగా వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే కేంద్రానికి నివేదిక పంపామని, అవసరమైన సహాయం అందేలా ప్రతిపాదనలు సమర్పిస్తామని చెప్పారు. గతంలో కరోనా వంటి సంక్షోభాలను ఎదుర్కొన్న సమయంలో ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేశాయని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత పరిస్థితుల్లోనూ రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాల కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఎదురయ్యే సవాళ్లపై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించి రాష్ట్రాన్ని కరువు ముప్పు నుంచి కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల సాధనలో రాజకీయాలకు తావు లేకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలకు అండగా నిలవడమే లక్ష్యంగా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అఖిలపక్ష సమావేశంలో పాల్గొని విలువైన సలహాలు, సూచనలు అందించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

సమావేశానికి కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఎల్‌నినో నోడల్ అధికారి రామకృష్ణారావులు హాజరయ్యారు. అఖిలపక్ష నాయకులు కాంగ్రెస్ తరఫున అంజన్ కుమార్ యాదవ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, బీఆరఎస్ తరఫున వినోద్ కుమార్, ఎల్.రమణ, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బీజేపీ తరఫున శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి, వెంకటేశ్వర్లు, ఆర్జేడీ నాయకురాలు శోభా యాదవ్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు శ్రీరామ్ కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హేమ సుదర్శన్, తెలుగుదేశం పార్టీ తరఫున కాట్రగడ్డ ప్రసన్నకుమార్ తదితరులు హాజరయ్యారు. కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, రైతులకు అండగా నిలిచే చర్యలు, తాగు, సాగునీటి సమస్యల పరిష్కారం తదితర అంశాలపై వారంతా తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.

కరువును అధిగమించేందుకు చర్యలు

- **ప్రకృతి విపత్తును అధిగమించేందుకు అఖిలపక్ష సూచనల మేరకు చర్యలు**
- **రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**
- **మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ**



హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

కరువు పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం సానుకూల, నిర్మాణాత్మక దృక్పథంతో ముందుకు సాగుతుందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు.అంతర్రాష్ట్ర నదీజలాల అంశాల్లో రాష్ట్ర ప్రయోజనాలను, రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సచివాలయంలో ప్రభుత్వం బుధవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులు, వాటివల్ల ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, కరువు నివారణకు ముందస్తు చర్యలు వంటి కీలక అంశాలపై అఖిలపక్ష నాయకుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. తదుపరి కార్యాచరణను నిర్ణయించే సమయంలో వారి అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను పంచుకున్న నాయకులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రకృతి విపత్తు కారణంగా ఎదురవుతున్న సవాళ్లను నిర్మాణాత్మక దృక్పథంతో పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. నదీ జలాల అంశాల్లో రాష్ట్ర ప్రయోజనాలను, తెలంగాణ రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, ఎల్‌నినో నోడల్ అధికారి రామకృష్ణారావు హాజరయ్యారు. కాంగ్రెస్ నేత అంజన్‌కుమార్ యాదవ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వినోద్‌కుమార్, ఎల్.రమణ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీజేపీ ప్రతిపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి, వెంకటేశ్వర్లు, ఆర్జేడీ నాయకురాలు శోభా యాదవ్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు శ్రీరామ్ కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు హేమ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు వ్యక్తం చేసిన ఆందోళనలను ప్రభుత్వం శ్రద్ధగా ఆలకించిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

తెలంగాణలో ఐపీఎస్‌ల బదిలీలు

మొదటిపేజీ తరువాయి

ఈ మార్పుల్లో పలువురికి అదనపు బాధ్యతలు కూడా అప్పగించింది.

మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న జయేష్ రంజన్‌ను పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఎఫ్డీ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న వికాస్ రాజ్‌ను విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేసింది. యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ.వాణి ప్రసాద్‌కు క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు కేటాయించింది. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న నవీన్ మిట్టల్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది.

రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ ప్రధాన కార్యదర్శిగా శైలజ రామయ్యర్‌ను నియమించింది. రెవెన్యూ (విపత్తు నిర్వహణ) శాఖ ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. రవాణా, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శిగా డాక్టర్ కె. ఇలంబరితిని నియమించడంతో పాటు రవాణా కమిషనర్ బాధ్యతలు కూడా కేటాయించింది.

హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు హెచ్ఎండీఏ పరిధిలోని పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి బాధ్యతలతోపాటు జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా శృతి ఓజాను నియమించింది. తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. అదే సమయంలో ఆయనకు విద్యుత్ సంస్థ సీఎండీ బాధ్యతలను కొనసాగించింది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణను మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించింది. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్‌కు టీజీరెడ్కో వైస్ చైర్మన్, ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

తాగునీటి వృథాకు చెక్..

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

రాష్ట్రంలో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా, తాగునీటి వృథాను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమైంది. మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీలు), శుద్ధి చేసిన నీటి వినియోగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ నాటికి కొత్త మార్గదర్శకాలన్నీ క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సమస్య రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు.

ఎస్‌టీపీల్లో నీటి శుద్ధి నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సీఎం సూచించారు. ప్లాంట్లలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగించాలని, ప్రతి కేంద్రానికి ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి, హైడ్రా పర్యవేక్షణలో నిర్వహించాలని తెలిపారు. నిర్వహణ వ్యయాన్ని తగ్గించేందుకు సౌర విద్యుత్ వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ల్యాండ్‌స్కేప్‌లు, రోడ్ల శుభ్రతకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయ పరిసరాలు, ప్రభుత్వ పార్కుల్లోనూ ఇదే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. రైల్వే, మెట్రో రైలు విభాగాలను ఈ పరిధిలోకి తీసుకురావాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇతర అవసరాలకు వంద శాతం ట్రీటెడ్ వాటర్ వినియోగించేలా తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. భవన నిర్మాణ అనుమతుల మంజూరులోనూ శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని తప్పనిసరి చేసే నిబంధనలు తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రైవేటు ఎస్‌టీపీలను ప్రోత్సహించడంతోపాటు, అధికంగా నీటిని వినియోగించే డేటా సెంటర్లకు ట్రీటెడ్ వాటర్ సరఫరా చేయాలని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని, ట్యాంకర్ల కదలికలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. శుద్ధి చేసిన నీటి కొనుగోలు, సరఫరా కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్‌లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని, క్యూర్ పరిధిలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో బుధవారం తాగునీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, శుద్ధి చేసిన నీటి వినియోగంపై ఆయన సమీక్ష నిర్వహించారు.

సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు పరిధితోపాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణకు శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని సీఎం సూచించారు. పార్కులు, రోడ్ల శుభ్రతకు కూడా ఈ నీటినే వాడాలని, భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటి వినియోగ నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రైవేటు ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించడంతో పాటు డేటా సెంటర్లకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఎస్టీపీల నిర్వహణకు సౌర విద్యుత్ వినియోగించే అవకాశాలను పరిశీలించాలని రెడ్కో అధికారులకు తెలిపారు.శుద్ధి కేంద్రాల్లో అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని, నీటి నాణ్యత విషయంలో రాజీ పడొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి ప్లాంట్ వద్ద ప్రత్యేక అధికారిని నియమించి, అన్ని కేంద్రాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించాలని ఆదేశించారు. ఎస్టీపీల పనితీరును హైడ్రా నిరంతరం పర్యవేక్షించాలని, ట్రీటెడ్ వాటర్ ట్యాంకర్ల కదలికలను గుర్తించే ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. శుద్ధి చేసిన నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు సరఫరా కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్టీపీల నిర్వహణ, శుద్ధి చేసిన నీటి వినియోగానికి సంబంధించిన ఆదేశాలు నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం 26 ఎస్టీపీల నుంచి గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు తెలిపారు. వినియోగదారుల నుంచి రవాణా రుసుము మాత్రమే వసూలు చేస్తున్నామని, నీటిని ఉచితంగా అందిస్తున్నామని వివరించారు.



నేర పరిశోధనలో డిజిటల్ దూకుడు

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

నేర పరిశోధనలో వేగం పెంచడంతోపాటు క్షేత్రస్థాయి పోలీసులకు సాంకేతిక ఆధారాలను తక్షణమే అందించేలా తెలంగాణ పోలీసు శాఖ ఏడు నూతన డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. అనుమానితుల ముఖాలను 15 సెకన్లలో గుర్తించే యాప్, సంఘటనా స్థలంలో లభించిన వేలిముద్రలను సాధారణ స్మార్ట్‌ఫోన్‌తోనే సరిపోల్చే వ్యవస్థ వీటిలో ప్రధానమైనవి. డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీజీపీ సి.వి. ఆనంద్ ఈ సేవలను ప్రారంభించారు. సీఐడీ రూపొందించిన మొబైల్ ఫేస్ సెర్చ్ యాప్ రాష్ట్రవ్యాప్తంగా 9.8 లక్షలకు పైగా నేరస్థుల ఫొటోలతో కూడిన డేటాబేస్‌తో అనుసంధానమై పనిచేస్తుంది. అనుమానితుడి ఫొటోను ఫోన్‌తో తీసిన 15 సెకన్లలోనే అందుబాటులోని రికార్డులతో సరిపోల్చి, గత నేర చరిత్ర, పెండింగ్ కేసుల వివరాలను చూపిస్తుంది. తప్పిపోయిన వ్యక్తులు, అనాథలు, గుర్తుతెలియని మృతదేహాల గుర్తింపునకూ ఈ యాప్ ఉపయోగపడుతుంది. క్రైమ్ సీన్ ఛాన్స్ ప్రింట్ యాప్ ద్వారా సంఘటనా స్థలంలో లభించే వేలిముద్రలను ఆండ్రాయిడ్ ఫోన్‌తో స్కాన్ చేసి రాష్ట్ర సర్వర్‌కు పంపవచ్చు. అక్కడి ఫింగర్‌ప్రింట్ డేటాబేస్‌తో వాటిని సరిపోల్చి నిందితుడి వివరాలను నిమిషాల్లోనే గుర్తించే అవకాశం ఉంటుంది. దీంతో ప్రయోగశాల నివేదికల కోసం ఎదురుచూసే సమయం తగ్గనుంది. పోలీసు సేవల్లో జవాబుదారీతనం పెంచేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్‌ను ప్రారంభించారు.ఎఫ్ఐఆర్ నమోదు, పిటిషన్ల పరిష్కారం, ఈచలాన్లు, పాస్‌పోర్టు ధ్రువీకరణ వంటి సేవలపై ప్రజల అభిప్రాయాలను సేకరించి సిబ్బంది పనితీరును సమీక్షించనున్నారు.రాష్ట్రంలోని 35 భరోసా కేంద్రాలను ఏకీకృత సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానించి, బాధితులకు అందించే కౌన్సెలింగ్, వైద్య, న్యాయ సహాయ సేవలను డిజిటల్ విధానంలో పర్యవేక్షించనున్నారు. జైలు నుంచి ఖైదీ విడుదలైన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరేలా ఈప్రిజన్స్ వ్యవస్థను సీసీటీఎన్ఎస్‌తో అనుసంధానించారు. జైలు విడుదలైన ఖైదీల నిర్వహణ వ్యవస్థ (జేఆర్ఎంఎస్) ద్వారా పాత నేరస్థుల కదలికలను విశ్లేషించి నిఘా ఉంచనున్నారు. దర్యాప్తు నాణ్యతను పెంచి, న్యాయస్థానాల్లో శిక్షల ఖరారు శాతం మెరుగుపరిచేందుకు ఐదు సంపుటాల ప్రామాణిక కార్యాచరణ విధానాలను (ఎస్ఓపీలు) విడుదల చేశారు. సీఐడీ సేవలు, సమాచారానికి ప్రత్యేక వెబ్‌సైట్ (cid.tspolice.gov.in)ను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ డీజీ మహేష్ భగవత్, సీఐడీ డీజీ చారు సిన్హా, అదనపు డీజీ అకున్ సబర్వాల్, ఐజీ గజరావు భూపాల్, డీఐజీలు నారాయణ నాయక్, పరిమళ హన నూతన్, ఎస్పీలు విశ్వజిత్ కంపాటి, రూపేష్, ప్రవీణ్ కుమార్, మల్లారెడ్డి, బాలకోటి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ రైళ్ల కోసం కాంగ్రెస్ ధర్నా

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

ఢిల్లీలో నవంబర్ 1న కాంగ్రెస్ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కోరగా దక్షిణ మధ్య రైల్వే నిరాకరించింది. దీంతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలు హైదరాబాద్‌లోని రైల్వే నిలయం వద్ద ధర్నాకు దిగారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా లక్షలాది మంది ఢిల్లీకి చేరుకుంటారని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. ఆందోళన నేపథ్యంలో పోలీసులు మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మరోవైపు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండీ కూటమి ర్యాలీ నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి దాదాపు 10 లక్షల మంది హాజరవుతారని కాంగ్రెస్ ప్రకటించింది. హర్యానా కాంగ్రెస్ ఇన్‌ఛార్జి సంజయ్ దత్, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రావు నరేంద్ర సింగ్ ఈ మేరకు వెల్లడించారు.

ఓటర్ల జాబితా పారదర్శకత, పౌరుల ఓటు హక్కు పరిరక్షణ విషయంలో రాజీపడబోమని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం తీరుతోపాటు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలకు నిరసనగా చేపట్టిన 'ఓట్ బచావో-దేశ్ బచావో' ప్రచారానికి ఈ ర్యాలీ ముగింపు కానుందని తెలిపారు. 'ఓట్ల చోరీ'కి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడుతున్నామనే సందేశాన్ని ఈ ప్రదర్శన ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తామని వెల్లడించారు.



ప్రజాస్వామ్యం ఊసెత్తే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

మొదటిపేజీ తరువాయి

వచ్చిన తర్వాత ధర్నా చౌక్‌ను పునరుద్ధరించి ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. గతంలో నిరసన తెలిపిన వారిని అణచివేయడం, నోరు మూయించే ప్రయత్నాలు చేయడం వంటి చర్యలకు పాల్పడినవారు ఇప్పుడు తమపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించుకోవాలని హితవు పలికారు. నవంబర్ 2న హోం మంత్రి అమిత్‌షా పాదయాత్రపై పొంగులేటి స్పందిస్తూ కేంద్రంలో నిరసనలకు ఆటంకాలు కల్పిస్తూ తెలంగాణలో పాదయాత్రలు చేపట్టాలని బీజేపీ నాయకులు భావించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ అయినా తన అభిప్రాయాలను వ్యక్తం చేసుకోవచ్చని, పాదయాత్రలు నిర్వహించవచ్చని తెలిపారు. అయితే అదే స్వేచ్ఛను ఇతర పార్టీలకు కూడా కల్పించాలన్నదే తమ అభిప్రాయమని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా అర్హులైన ఓటర్ల ఓటు హక్కును తొలగిస్తున్నారనే అంశంపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోందని, 'సర్' ప్రక్రియలో ఓటర్ల సమస్యలపై పునఃపరిశీలన జరిపి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తోందని అన్నారు. ఈ అంశంపై నాలుగైదు నెలలుగా దిల్లీ కేంద్రంగా వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళనలు చేపట్టినా కేంద్రం, కేంద్ర ఎన్నికల సంఘం స్పందించడం లేదని విమర్శించారు. ఎన్నికల ప్రధాన కమిషనర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఆయన రాజీనామా చేసేలా చూడాలని లేదా చట్ట ప్రకారం పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు.

దిల్లీ ర్యాలీకి రైళ్లు కేటాయించకపోవడం సమంజసం కాదు

ఓటు హక్కు పరిరక్షణకు చేపట్టిన ఆందోళనలో భాగంగా నవంబర్ 1న దిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించాలని ఇండి కూటమి పిలుపునిచ్చినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా లక్షలాది మంది తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రైల్వే బోగీలు కేటాయించాలని కోరినా కేంద్రం అనుమతులు ఇవ్వడం లేదని విమర్శించారు. పది రోజులుగా రాష్ట్రంతోపాటు పలు రాష్ట్రాల్లో ఇండి కూటమి నేతలు, కార్యకర్తలకు రైళ్ల కేటాయింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రాజకీయ కార్యక్రమాలకు రైళ్లను కేటాయించే విషయంలో కేంద్రం రాజకీయాలకతీతంగా వ్యవహరించాలని సూచించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజాప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలని, ప్రజాస్వామ్యబద్ధమైన కార్యక్రమాలకు అవసరమైన రవాణా సదుపాయాలను కల్పించాలని కోరారు.

కేంద్ర సంస్థల వ్యవహారాలపై ఆధారాలతో ప్రశ్నిస్తాం

'సర్' ప్రక్రియతోపాటు రైల్వే శాఖ వ్యవహారాలు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్ణయాలపై తమ పార్టీ ప్రశ్నలు లేవనెత్తుతుందని పొంగులేటి తెలిపారు. వివిధ అంశాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఆధారాలతో ప్రజల ముందుంచుతామన్నారు. ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలను అడ్డుకోవడం, రాజకీయ కార్యక్రమాలకు ఆటంకాలు కల్పించడం వంటి చర్యలపై ప్రజాక్షేత్రంలో పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

నిరాడంబరంగా మంత్రి పొంగులేటి పుట్టిన రోజు

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి



కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ నిధులు

న్యూఢిల్లీ, ఆశ్వి అప్డేట్స్:

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కరువు భత్యం (డీఏ), కరువు సహాయ భత్యం (డీఆర్) కోసం కేంద్ర కేబినెట్ రూ.10,016 కోట్లు కేటాయించింది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన భత్యాల కోసం ఈ నిధులను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే డీఏ, డీఆర్ ఎంత శాతం పెంచారనే వివరాలు వెల్లడించిన సమాచారంలో లేవు.

దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేయడం లక్ష్యంగా మరో మూడు కీలక నిర్ణయాలకు కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. వీటితో కలిపి నాలుగు నిర్ణయాల కోసం మొత్తం రూ.29,267 కోట్లు కేటాయించినట్లు ప్రకటించింది.

కంటైనర్ తయారీ రంగానికి ఊతమిచ్చేందుకు రూ.10,000 కోట్లతో ప్రత్యేక పథకాన్ని చేపట్టనుంది. దేశంలో కంటైనర్ల ఉత్పత్తిని పెంచడం, తయారీ కార్యకలాపాలను విస్తరించడం దీని ప్రధాన ఉద్దేశం.

క్రీడా వస్తువుల తయారీ పరిశ్రమ అభివృద్ధి కోసం 'ఖేలో ఇండియా స్పోర్ట్స్ గూడ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్'కు రూ.1,856 కోట్లు కేటాయించింది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల కోసం 'ప్రధానమంత్రి వికసిత్ గ్రామ స్వరాజ్ యోజన'కు రూ.7,395 కోట్లు మంజూరు చేసింది. ఈ నిర్ణయాలతో తయారీ రంగం, గ్రామీణాభివృద్ధికి ప్రోత్సాహం లభించనుంది.

ఎస్ఐఆర్‌పై దుష్ప్రచారానికి వ్యతిరేకంగా బీజేపీ పాదయాత్ర

- **నవంబర్ 2న హైదరాబాద్‌లో మహా పాదయాత్ర**
- **ముఖ్య అతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా**
- **కాంగ్రెస్, ఇండీ కూటమి వైఖరిపై నిరసన**
- **బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు**

హైదరాబాద్, అక్టోబర్ 28, ఆశ్వి అప్డేట్స్:

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు నవంబర్ 2న హైదరాబాద్‌లో మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ ప్రకటించింది. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ సమగ్రత, శాంతిభద్రతల అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే యాత్ర లక్ష్యమని వెల్లడించింది.



'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకవాదాన్ని అంతం చేద్దాం' అనే నినాదంతో సాయంత్రం 4 గంటలకు పాదయాత్ర ప్రారంభం కానుంది. ట్యాంక్‌బండ్‌పై ఉన్న స్వామి వివేకానంద విగ్రహం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు యాత్ర కొనసాగుతుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహా పలువురు పార్టీ నేతలు పాల్గొననున్నారు.

కాంగ్రెస్, ఇండీ కూటమి రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అపోహలు సృష్టిస్తోందని బీజేపీ ఆరోపించింది. ఈ ప్రచారాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టి వాస్తవాలను వివరించడమే మహా పాదయాత్ర ఉద్దేశమని తెలిపింది. పార్టీ శ్రేణులు, మేధావులు, జాతీయవాదులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది.

కేటీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేయొద్దు

హైదరాబాద్, అక్టోబర్ 28, ఆశ్వి అప్డేట్స్:

బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్)పై తప్పుడు ఆరోపణలు చేయవద్దంటూ ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్‌లను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది. కేటీఆర్ దాఖలు చేసిన రూ.10 కోట్ల పరువు నష్టం దావాలో విచారణ సందర్భంగా న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దావాలో ప్రస్తావించిన అంశాలకు సంబంధించి కేటీఆర్‌పై మరిన్ని తప్పుడు ఆరోపణలు చేయరాదని స్పష్టం చేసింది. కేటీఆర్‌పై డ్రగ్స్ వినియోగానికి సంబంధించిన ఆరోపణలు చేయడం, ఆయనను డ్రగ్స్‌కు బానిసగా చిత్రీకరించడం, డ్రగ్స్ సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారనే అభిప్రాయాన్ని కలిగించడం, మహిళలు, సినీ ప్రముఖులు, ఇతర ప్రముఖులతో వ్యక్తిగత సంబంధాలపై ఆరోపణలు చేయడం వంటి అంశాలను కేటీఆర్ తన దావాలో సవాలు చేశారు. సరైన ధ్రువీకరణ లేకుండా వీడియోలు, ఇంటర్వ్యూలు, వార్తా కథనాల ద్వారా ఇలాంటి ఆరోపణలను ప్రచారం చేయడం వల్ల తన ప్రతిష్ఠకు భంగం కలిగిందని పేర్కొన్నారు. ఈ కేసులో కేటీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది పి.విశ్వజ నని కోర్టులో బుధవారం వాదనలు వినిపించారు. వాదనలు విన్న అనంతరం న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వివాదాస్పద ఆరోపణలకు సంబంధించిన ఇప్పటికే ప్రచురించిన వీడియోలు, వార్తా కథనాలను తొలగించాలని సంబంధిత మీడియా సంస్థలను కోర్టు ఆదేశించింది. భవిష్యత్తులోనూ దావాలో ప్రస్తావించిన అంశాలకు సంబంధించిన ఇలాంటి కంటెంట్‌ను ప్రచురించవద్దని ఆదేశాలు జారీ చేసింది. తనపై తప్పుడు, పరువు నష్టం కలిగించే ప్రచారాన్ని నిలువరించడంతోపాటు జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని కోరుతూ కేటీఆర్ రూ.10 కోట్ల నష్టపరిహారంతోపాటు తప్పనిసరి, శాశ్వత నిషేధాజ్ఞల కోసం సివిల్ దావా దాఖలు చేశారు.



కరువు జాబితాలో కరీంనగర్‌కు అన్యాయం

- **అర్హత ఉన్న మండలాలకు జాబితాలో చోటేది?**
- **35 శాతం లోటు వర్షపాతం ఉన్నా గుర్తించలేదని ఆగ్రహం**
- **కరువు ఎంపిక ప్రమాణాలు వెల్లడించాలని డిమాండ్**
- **అర్హులైన మండలాలను జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి**
- **కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

హైదరాబాద్, అక్టోబర్ 28, ఆశ్వి అప్డేట్స్:

తెలంగాణలో కరువు మండలాల ఎంపికపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యధిక లోటు వర్షపాతం నమోదైన అనేక మండలాలను జాబితాలో చేర్చకుండా మొక్కుబడిగా ప్రకటన చేశారని విమర్శించారు. మండలాల ఎంపిక అశాస్త్రీయంగా ఉందని, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తాజాగా పత్రికా ప్రకటన విడుదల చేశారు.

35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలు సైతం కరువు జాబితాలో లేకపోవడం బాధాకరమని బండి సంజయ్ అన్నారు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వం గుర్తించలేదా అని ప్రశ్నించారు. పొలాలు బీళ్లుగా మారి తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడితే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని పేర్కొన్నారు.

కరువు మండలాల ఎంపికకు అనుసరించిన ప్రమాణాలు, అధికారిక గణాంకాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి మండలంలోని వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం, పంటల పరిస్థితి, నేలలో తేమ, భూగర్భ జలాల వివరాలను వెల్లడించాలని కోరారు. కరువు జాబితాలో చోటు దక్కని ప్రాంతాల రైతుల ఫిర్యాదులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర సగటు వర్షపాతం ఆధారంగా కాకుండా ప్రతి మండల పరిస్థితిని విడివిడిగా పరిశీలించాలని స్పష్టం చేశారు.



అర్హత ఉన్న మండలాలు మినహాయింపునకు గురైనట్లు తేలితే నిబంధనల ప్రకారం వాటిని జాబితాలో చేర్చాలని బండి సంజయ్ కోరారు. రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి వాస్తవ పరిస్థితుల ఆధారంగా కరువు మండలాలను ప్రకటించాలని, ప్రభావిత రైతులకు అర్హత మేరకు సహాయం అందించాలని డిమాండ్ చేశారు. పేదలకు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించాలని, రైతులు, పేదలకు అన్యాయం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఏఐతో మెరుగైన సేవలే లక్ష్యం

- **సామాన్యుడి జీవితంలో మార్పు రావాలి**
- **కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయం ప్రజలకు తిరిగి అందాలి**
- **సామాన్యుడి సమస్య పరిష్కారమే సాంకేతికత వినియోగానికి గీటురాయి**
- **'ఏఐ సాక్షమ్' ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

హైదరాబాద్, అక్టోబర్ 28, ఆశ్వి అప్డేట్స్:

కృత్రిమ మేధస్సు(ఏఐ)తో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు వేగవంతం కావాలి.. సమస్యలు సకాలంలో పరిష్కారమై రైతులు, పింఛనుదారులు, సామాన్యులు తమ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలి.. కార్యాలయంలో ఆదా అయ్యే ప్రతి గంట ప్రజలకు తిరిగి అందించే సమయంగా మారాలి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజల జీవితాల్లో కనిపించే సానుకూల మార్పే ప్రభుత్వ పాలనలో ఏఐ విజయానికి అసలైన కొలమానం అని చెప్పారు. సాంకేతికత ఎంత అధునాతనమైనదన్నది ముఖ్యం కాదు.. అది ప్రజలకు ఎంత మెరుగైన సేవలందించగలిగిందన్నదే కీలకమని పేర్కొన్నారు. హైదరాబాద్ ఎంసీఆర్ హెచఆర్‌డీలో ప్రణాళికా శాఖ సహకారంతో టీజీ మ్యాథ్ బుధవారం చేపట్టిన 'ఏఐ సాక్షమ' ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాలను పెంపొందించి ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా, సమర్థంగా సేవలందించే పరిపాలనా వ్యవస్థను నిర్మించడమే ఈ కార్యకమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

ప్రజాధనం వినియోగంలో మెరుగైన విశ్లేషణ

ఆర్థిక శాఖలో ప్రజాధనం సరైన లక్ష్యాలకు చేరుతోందా.. వ్యయాల్లో జాప్యాలకు కారణాలేమిటి.. ప్రాజెక్టుల అమలులో ఎక్కడ లోపాలున్నాయి అనే అంశాలను విశ్లేషించేందుకు ఏఐ సాధనాలు దోహదపడగలవని తెలిపారు. వివిధ ప్రాజెక్టుల వ్యయాలను పోల్చడం, అసాధారణ వ్యయ ధోరణులను గుర్తించడం ద్వారా అధికారులు మరింత సమర్థంగా వ్యవహరించవచ్చన్నారు. అయితే, ఒక వ్యవస్థగుర్తించిన అసాధారణ ధోరణి అక్రమాలకు రుజువు కాదని, ప్రతి అంశాన్ని ఆధారాలు, నిబంధనల ప్రకారం పరిశీలించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రణాళికా రంగంలో గణాంకాల సగటులు వాస్తవ పరిస్థితులను పూర్తిగా ప్రతిబింబించకపోవచ్చన్నారు. ఒక జిల్లాలో అభివృద్ధి సూచికలు మెరుగ్గా ఉన్నా మారుమూల ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలు అందకపోవచ్చన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరుతున్నాయా.. ఎక్కడ లోటుపాట్లు ఉన్నాయి అనే అంశాలను గుర్తించేందుకు ఏఐ విశ్లేషణ ఉపయోగపడుతుందని వివరించారు. క్షేత్రస్థాయి పర్యటనలు, ప్రజల అభిప్రాయాలు, ఉద్యోగుల అనుభవానికి ప్రాధాన్యం కొనసాగాలని స్పష్టం చేశారు.

విద్యుత్ రంగంలోనూ ఉపయోగకరం

విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేయడం, పరికరాల్లో తలెత్తే లోపాలను గుర్తించడం, నిర్వహణ చర్యలను మెరుగుపరచడంలో ఏఐ ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు, చిన్న పరిశ్రమలు, హాస్పిటల్స్‌కు నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం దోహదపడుతుందన్నారు. అయితే, వాస్తవ పరిస్థితుల్లో వ్యవస్థ పనితీరును, భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ కార్యాలయాల్లో తరచుగా ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఏఐ సాధనాలను ప్రయోగాత్మకంగా వినియోగించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వులను గుర్తించడం, నివేదికలు రూపొందించడం, ప్రజలకు అర్థమయ్యే రీతిలో సమాచారాన్ని అందించడం వంటి పనుల్లో ఏఐ ద్వారా సమయం ఆదా చేయవచ్చన్నారు. అలా ఆదా అయిన సమయాన్ని క్లిష్టమైన కేసులను పరిశీలించడానికి, మరింతమందికి సేవలందించడానికి వినియోగించాలని సూచించారు. తెలుగులో స్పష్టమైన సమాచారాన్ని అందించేందుకు ఏఐ ఉపయోగపడుతుందని, అయితే భాషాపరమైన స్పష్టత మాత్రమే సమాచార కచ్చితత్వానికి హామీ కాదని అన్నారు. పేర్లు, మొత్తాలు, అర్హత నిబంధనలు, సాంకేతిక అంశాలను సంబంధిత అధికారులు ధ్రువీకరించాలని సూచించారు.

ప్రజల సమాచార భద్రతకు ప్రాధాన్యం

ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు అందించే వ్యక్తిగత సమాచారాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అనుమతి లేని ఏఐ సాధనాల్లో అధికారిక లేదా వ్యక్తిగత సమాచారాన్ని నమోదు చేయరాదన్నారు. ఏ సమాచారాన్ని వినియోగించవచ్చు.. దేనికి ప్రత్యేక అనుమతులు అవసరం.. ఏ సమాచారాన్ని నమోదు చేయకూడదు అనే అంశాలపై ఉద్యోగులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. ఏఐ రూపొందించిన సమాచారం తప్పుగా ఉండే అవకాశం ఉన్నందున దాన్ని అధికారిక రికార్డుల్లో చేర్చే ముందు లేదా నిర్ణయాలకు ఆధారంగా ఉపయోగించే ముందు ధ్రువీకరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనన్నారు. ఏఐ ఆధారంగా తీసుకున్న నిర్ణయాల్లోనూ మానవ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని, ప్రతికూల నిర్ణయాలపై పౌరులు అధికారులను సంప్రదించే అవకాశం కల్పించాలని తెలిపారు. ఏఐ ఆధారిత వ్యవస్థలకు అధికారాలు కల్పించే ముందు వాటి పరిమితులను స్పష్టంగా నిర్ణయించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ముసాయిదా తయారు చేసే సాధనానికి, అధికారిక ఆదేశాలు పంపే లేదా రికార్డులను మార్చే వ్యవస్థకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి తగిన నియంత్రణలు ఏర్పాటు చేయాలన్నారు. ఏదైనా తప్పు జరిగితే బాధ్యత వహించే వ్యక్తి ఎవరో స్పష్టంగా ఉండాలన్నారు. ప్రతి శాఖలో చిన్నస్థాయి ప్రయోగాలతో ప్రారంభించి, వాటి కచ్చితత్వం, ఖర్చు, ప్రజలకు కలిగే ప్రయోజనం, పనితీరును అంచనా వేసిన తర్వాతే విస్తరణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో 'ఏఐ సాక్షమ' కీలక పాత్ర పోషిస్తుందని భట్టి అన్నారు. కార్యక్రమంలో ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, టీజీ మ్యాథ్ ఎండీ పూజ, ఎంసీఆర్ హెచఆర్‌డీ డైరెక్టర్ జనరల్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.





పట్టభద్రుల ఓటర్ల నమోదుపై
బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి

- **అధిక ఓట్ల నమోదుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి: మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

ఆశ్వి అప్డేట్స్ | చిట్యాల

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదులో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అత్యధిక ఓట్ల నమోదు లక్ష్యంగా కృషి చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. బుధవారం చిట్యాలలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన గ్రామాలు, చిట్యాల మున్సిపాలిటీ వార్డుల వారీగా నమోదైన ఓట్ల వివరాలను సమీక్షించారు.

పట్టభద్రులను గుర్తించి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలని, గత ఓటరు జాబితాలను పరిశీలిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు చొరవ చూపాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని చిరుమర్తి లింగయ్య పేర్కొన్నారు. వ్యక్తిగత స్వార్థానికి తావులేకుండా పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌పై
కేసులు ఉపసంహరించుకోవాలి

- **గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్ డిమాండ్**

ఆశ్వి అప్డేట్స్ | ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో | అక్టోబర్ 28

వనపర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌పై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం వనపర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఘనపూర్ పోలీస్‌స్టేషన్‌లో 10 మంది బీఆర్ఎస్ కార్యకర్తలపై క్రైమ్ నంబర్ 42/2026, సెక్షన్ 352 కింద కేసులు నమోదు చేయడాన్ని తప్పుబట్టారు. పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హయాంలో నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, ప్రస్తుత పాలకులు మిగిలిన రోడ్ల విస్తరణ పనులను పూర్తి చేయలేకపోతున్నారని విమర్శించారు. చిన్నంబావి మండలం లక్ష్మీపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో రెండున్నరేళ్లు గడిచినా దర్యాప్తులో పురోగతి లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో న్యాయవాదులు ఎన్. రాజు సాగర్, రాహుల్ రాథోడ్, గంధం పరంజ్యోతి, దొడ్ల రాములు, సూర్యవంశం గిరి తదితరులు పాల్గొన్నారు.



మహిళలు, బాలల భద్రతకు
అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

- **పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి: వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**

ఆశ్వి అప్డేట్స్ | వికారాబాద్ | అక్టోబర్ 28

మహిళలు, బాలలపై జరిగే నేరాల నియంత్రణతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ సూచించారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రతా విభాగం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా భద్రతా విభాగం పనితీరు, భరోసా కేంద్రాల నిర్వహణ, లైంగిక నేరాల కేసుల దర్యాప్తు, ఐటీఎస్ఎస్ఓ పోర్టల్‌లో పెండింగ్ కేసుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు. మహిళలు, బాలలకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. పోక్సో, లైంగిక నేరాల కేసుల్లో బాధితులకు వైద్య, న్యాయ, కౌన్సెలింగ్ సహాయం అందించాలని, వారి గోప్యతను కాపాడాలని సూచించారు. కేసుల దర్యాప్తును నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, పోర్టల్‌లో వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, మహిళా పోలీస్ స్టేషన్లు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, మిస్సింగ్ పర్సన్స్ మానిటరింగ్ సెల్ పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, మహిళలు, బాలల భద్రతకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా ఐపీఎస్, డీసీఆర్‌బీ డీఎస్పీ జనయ్య, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా, భరోసా ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ!

- **రూ.20 కోట్లతో ఆలయ పరిసరాల అభివృద్ధి.. సాగర్ రోడ్డుపై ప్రమాదాల నివారణకు డివైడర్లు***

ఆశ్వి అప్డేట్స్ | నల్లగొండ | అక్టోబర్ 28*

నల్లగొండ జిల్లాలో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ బీవీ రావు తదితర ఉన్నతాధికారులు ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయిలో సమీక్షించారు.

రూ.20 కోట్లతో ఆలయ అభివృద్ధి

ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 కోట్లతో ఆలయ ప్రాంగణంలోని కోనేరుకు అన్ని వైపులా మెట్ల నిర్మాణం, ఆలయం వెనుక భాగం నుంచి భక్తుల రాకపోకలకు రహదారి ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ఆలయ పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని మేయర్ అధికారులకు సూచించారు. నిధులను సక్రమంగా వినియోగిస్తూ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు.

సాగర్ రోడ్డుపై ప్రమాదాల నివారణకు చర్యలు

నల్లగొండ పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణపై కూడా మేయర్ ప్రత్యేక దృష్టి సారించారు. వైఎస్సార్ విగ్రహం నుంచి మెడికల్ కళాశాల మీదుగా చర్లగౌరారం రోడ్డు వరకు డివైడర్ల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి, ప్రమాదాల ముప్పును తగ్గించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వాహనదారులు, పాదచారుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ పనుల్లో జాప్యం చేయరాదని స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ డీఈ అశోక్, ఏసీపీ కృష్ణవేణి, మంత్రి పీఏ మధుసూదన్‌రెడ్డి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల కల్పన, రహదారి భద్రత అంశాల్లో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు.





వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

- **తెలుగు రాష్ట్రాల్లో 29 చోరీ కేసులు.. రూ.50 లక్షల విలువైన కార్లు, నగదు స్వాధీనం***

ఆశ్వి అప్డేట్స్ | నల్లగొండ | అక్టోబర్ 28*

రైతుల వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైర్లు, ఆయిల్, ఇతర భాగాలను చోరీ చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ ముఠా 29 నేరాలకు పాల్పడినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ వెల్లడించారు.

వాహన తనిఖీలతో పట్టుబడిన నిందితులు

వేములపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ L15 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు చెందిన 500 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 300 కిలోల కాపర్, 250 లీటర్ల ఆయిల్ చోరీకి గురైన కేసులో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్టోబర్ 28న వేములపల్లి గ్రామ శివారులోని సూర్యాపేట క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు అనుమానితులు పట్టుబడ్డారు. వారి విచారణలో మరో వ్యక్తి పాత్ర వెలుగులోకి రావడంతో అతడిని కూడా అదుపులోకి తీసుకున్నారు.

రూ.50 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం

నిందితుల నుంచి సుమారు రూ.30 లక్షల విలువైన రెండు కార్లు, రూ.20 లక్షల నగదు, కాపర్ వైర్లు, రెండు కట్టర్లు, నాలుగు పానాలు, చేతి గ్లౌజులు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో 100 శాతం రికవరీ సాధించినట్లు వెల్లడించారు.

తెలుగు రాష్ట్రాల్లో 29 కేసులు

పోలీసుల వివరాల ప్రకారం, ఈ ముఠాపై తెలంగాణలో 25, ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు కేసులు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధితో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్, ఆయిల్ చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ముఠాలోని మరో ఐదుగురు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు

మిర్యాలగూడ డీఎస్పీ జి. రవి పర్యవేక్షణలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి, మిర్యాలగూడ రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ సోమనార్యయ్య, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.ఎన్.డి. ప్రసాద్, వేములపల్లి ఎస్ఐ వి. సురేశ్ రెడ్డి తదితరులు కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరుపర చనున్నట్లు పోలీసులు తెలిపారు.





వికారాబాద్‌లో మెగా రక్తదాన శిబిరం

- **467 యూనిట్ల రక్తం సేకరణ.. రక్తదాతలను అభినందించిన ఎస్పీ స్నేహా మెహ్రా***

ఆశ్వి అప్డేట్స్ | వికారాబాద్ | అక్టోబర్ 28, 2026*

పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాల్లో భాగంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులకు నివాళిగా వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని కొండ బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం *467 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.*

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ శిబిరాన్ని పరిశీలించి రక్తదానం చేసిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. *రక్తదానం ప్రాణదానంతో సమానమని*, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం అందించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఆరోగ్య పరిస్థితులు అనుకూలంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మానవతా విలువలు, సేవాభావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి, శిబిరం విజయవంతానికి సహకరించిన వైద్యులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

రెడ్‌క్రాస్, తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ ప్రతినిధులతో పాటు వికారాబాద్, తాండూరు ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బంది రక్తసేకరణలో సహకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, డీఎస్పీ అంజయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేష్, వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్, వివిధ పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.





శివన్నగూడెం ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలి

- **రాచకొండ గుట్టల్లో రిజర్వాయర్ నిర్మించి నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు సాగునీరు అందించాలి: డా. నాగం వర్షిత్ రెడ్డి**

ఆశ్వి అప్డేట్స్ | మునుగోడు | అక్టోబర్ 29*

మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందించేందుకు శివన్నగూడెం ప్రాజెక్టు పనులను తక్షణమే పూర్తి చేయాలని బీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు డా. నాగం వర్షిత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మునుగోడు నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల బీజేపీ అధ్యక్షులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు.

సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాల రైతులకు సాగునీరు అందించేందుకు రాచకొండ గుట్టల్లో రిజర్వాయర్ నిర్మించాలని కోరారు. శివన్నగూడెం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల ద్వారా రాచకొండ రిజర్వాయర్‌కు నీటిని తరలించి, గొలుసుకట్టు చెరువులను నింపేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. దిండి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ నాయకులు భిన్నమైన ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. రైతులకు ప్రకటనలు కాకుండా ప్రాజెక్టుల పూర్తితో సాగునీరు అందించడమే ముఖ్యమని పేర్కొన్నారు. జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రైతుల సమస్యలపై స్పందించి, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

శివన్నగూడెం ప్రాజెక్టు పూర్తి కోసం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయాలని కోరారు. రైతులకు సాగునీరు అందే వరకు బీజేపీ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని డా. నాగం వర్షిత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, తొమ్మిది మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సున్నా

- నాలుగు రాష్ట్రాల్లో 28 స్థానాలకు ఎన్నికలు
- 12 స్థానాల్లో పోటీ చేసి ఒక్కటి గెలవని కాంగ్రెస్
- కర్ణాటకలోనూ బీజేపీ–జేడీయూ కూటమిదే విజయం
- బ్యాలెట్ పేపర్ల అంశాన్ని ప్రస్తావించిన ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ, అక్టోబర్ 28, ఆశ్వి అప్డేట్స్:

నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బగా నిలిచాయి. బీహార్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని 28 శాసన మండలి స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. మొత్తం 12 స్థానాల్లో పోటీ చేసిన ఆ పార్టీకి నిరాశే ఎదురైంది. గతంలో కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహించిన నాలుగు స్థానాలను సైతం నిలబెట్టుకోలేకపోయింది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, నాలుగు ఎమ్మెల్సీ స్థానాలను బీజేపీ-జేడీయూ కూటమి కైవసం చేసుకుంది. దీని కథనంలో పేర్కొన్నారు. మిగతా రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్‌కు విజయం దక్కలేదు. ఉత్తరప్రదేశ్‌లో 11, బీహార్‌లో 8, మహారాష్ట్రలో 5, కర్ణాటకలో 4 స్థానాలకు ఎన్నికలు జరిగాయి.

ఈ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ ఎన్ని స్థానాలు గెలిచిందో ఊహించాలంటూ ఎమోజీతో పోస్టు చేశారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారా జరిగాయని ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతంలో ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పుడు కాంగ్రెస్ ఈవీఎంలపై విమర్శలు చేసేదని గుర్తుచేస్తూ, బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల్లోనూ ఆ పార్టీకి విజయం దక్కలేదనే అంశాన్ని తన పోస్టు ద్వారా ఎత్తిచూపారు.

సీఈసీపై ప్రజా అభిశంసనకు ఖర్గే నివాసమే వేదిక

- అనుమతుల వివాదంతో కార్యక్రమ స్థలం మార్పు
- 30న ప్రతిపక్షాల ప్రత్యేక కార్యక్రమం
- నవంబర్ 1న దిల్లీలో భారీ సభ
- రామ్‌లీలా మైదాన్ సభకు పోలీసుల షరతులు
- సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘం అఫిడవిట్‌పై ప్రతిపక్షాల అభ్యంతరాలు
- కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టిన బీజేపీ

దిల్లీ, అక్టోబర్ 28, ఆశ్వి అప్డేట్స్ :

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తొలగింపునకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి అక్టోబర్ 30న నిర్వహించనున్న ప్రతీకాత్మక ప్రజా అభిశంసన కార్యక్రమానికి వేదిక మారింది. దిల్లీలోని అశోక్ హోటల్, రామ్‌లీలా మైదాన్‌లలో కార్యక్రమం నిర్వహించేందుకు అనుమతుల సమస్యలు ఎదురయ్యాయని కాంగ్రెస్ ఆరోపించిన నేపథ్యంలో, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధికారిక నివాసంలో కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. అక్టోబర్ 30, శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు దిల్లీలోని 10, రాజాజీ మార్గ్‌లో కార్యక్రమం జరుగుతుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం ప్రకటించారు. పోటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని ప్రశ్నించడమే కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ప్రజా అభిశంసన కోసం తొలుత అశోక్ హోటల్ ప్రాంగణాన్ని ఎంపిక చేశామని, అనంతరం రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించేందుకు ప్రయత్నించామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. అయితే పోలీసుల జోక్యంతో అనుమతులు లభించలేదని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండి కూటమి నవంబర్ 1న దిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో భారీ నిరసన సభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. సభకు పోలీసులు శాంతిభద్రతల కోణంలో నిరభ్యంతర పత్రం జారీ చేశారు. అయితే సంబంధిత భూమి యాజమాన్య సంస్థ అనుమతి కూడా అవసరమని స్పష్టం చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే సభ నిర్వహించాలి. మైదానంలో రాత్రిపూట బస చేయకూడదు. సభా ప్రాంగణం నుంచి ఇతర ప్రాంతాలకు ప్రదర్శనగా వెళ్లరాదు. సీసీటీవీ కెమెరాలు, తాగునీరు, మరుగుదొడ్లు, వలంటీర్ల ఏర్పాట్ల బాధ్యత నిర్వాహకులదేనని పోలీసులు పేర్కొన్నారు. బుధవారం తాజా వార్తా కథనం ప్రకారం సభ కోసం 2,500 నుంచి 3,000 మంది పోలీసులను మోహరించేందుకు దిల్లీ పోలీసులు ప్రణాళిక సిద్ధం చేశారు. అదనంగా ఇతర ప్రాంతాల నుంచి పది కంపెనీల బలగాలను రప్పించనున్నారు. సభా ప్రాంగణాన్ని 14 భద్రతా జోన్లుగా విభజించనున్నారు. దాదాపు 450 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వెయ్యి మంది పోలీసులకు బాడీ కెమెరాలు అందించాలని ప్రతిపాదించారు.

ముగ్గురు కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే నిర్ణయాలు

ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలన్నీ ముగ్గురు కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే జరిగాయని సుప్రీంకోర్టులో సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొంది. అయితే ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి గతంలో వ్యక్తం చేసిన అభ్యంతరాల నేపథ్యంలో ఈ వివరణను పిటిషనర్లు ప్రశ్నిస్తున్నారు. రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకుల తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదిస్తూ, ఎన్నికల సంఘం అంతర్గత ఫైళ్లు, నిర్ణయాలకు సంబంధించిన నోటింగ్స్, అధికారిక సమాచారాన్ని భద్రపరచాలని కోరారు. మంగళవారం జరిగిన విచారణలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వివాదంలోని అన్ని అంశాలను పరిశీలిస్తామని పేర్కొంది. ఎన్నికల సంఘం అఫిడవిట్‌పై పిటిషనర్లు సమాధానం సమర్పించేందుకు అవకాశం కల్పిస్తూ తదుపరి



విచారణను నవంబర్ 17కు నిర్ణయించింది.

కాంగ్రెస్ పై బీజేపీ ధ్వజం

కాంగ్రెస్ దేశంలో అరాచకాన్ని, ప్రతికూల వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. అక్టోబర్ 27న గోవాలో జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ,ఎన్నికల్లో విజయం సాధించినప్పుడు ప్రజాస్వామ్యం బాగుందని చెప్పే కాంగ్రెస్ ఓడిపోయినప్పుడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆరోపిస్తోందన్నారు. ఎస్ఐఆర్ కొత్త ప్రక్రియ కాదని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనూ పోటర్ల జాబితాల ప్రత్యేక సవరణలు జరిగాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరోపణలకు ప్రతిస్పందనగా దేశవ్యాప్తంగా ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించారు.



రాత్రి వేళలో ఛార్జింగ్ నిలిపివేతపై

రైల్వే బోర్డు ఆదేశాలు

- రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల వరకు ఛార్జింగ్ బంద్
- పాత నిబంధన అమలుపై జోనల్ రైల్వేలకు ఆదేశాలు
- పవర్ బ్యాంక్ పేలుడు ఘటనతో భద్రతపై దృష్టి
- సిబ్బందికి సూచనలు.. ఆకస్మిక తనిఖీలకు చర్యలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 28, ఆశ్వి అప్డేట్స్:

రైళ్లలో అగ్నిప్రమాదాలను నివారించే చర్యల్లో భాగంగా రాత్రి వేళల్లో మొబైల్ ఛార్జింగ్ పాయింట్లను నిలిపివేసే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని రైల్వే బోర్డు ఆదేశించింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు కోచ్‌లలో ఛార్జింగ్ పాయింట్లు పనిచేయకుండా చూడాలని స్పష్టం చేసింది. ఈ మేరకు అక్టోబర్ 26న జారీ చేసిన తాజా సూచనల్లో అన్ని జోనల్ రైల్వేలు నిబంధన అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. దక్షిణ తూర్పు రైల్వే పరిధిలో ప్రయాణికుడి పవర్ బ్యాంక్ ఛార్జింగ్ సమయంలో పేలిపోయి పొగ వెలువడిన ఘటన నేపథ్యంలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసినట్లు సమాచారం. ఛార్జింగ్ పరికరాల వల్ల ప్రమాదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై అధికారులు దృష్టి సారించారు. వాస్తవానికి రైళ్లలో రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల వరకు ఛార్జింగ్ పాయింట్లను నిలిపివేయాలనే నిబంధన 2014 జూన్ 19 నుంచే అమల్లో ఉంది. అయితే, దాని అమలులో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా పర్యవేక్షణ పెంచాలని రైల్వే బోర్డు తాజా ఆదేశాల్లో సూచించింది. నిర్దేశిత సమయానికి ఛార్జింగ్ పాయింట్లను నిలిపివేసేలా సంబంధిత సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని తెలిపింది. భద్రతా నిబంధనలపై సిబ్బందికి శిక్షణ, అవగాహన కల్పించడంతోపాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. నిబంధనల ఉల్లంఘన జరిగితే బాధ్యులపై చర్యలకు సంబంధించి కూడా రైల్వే శాఖ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రయాణికులు నాణ్యమైన ఛార్జర్లు, పవర్ బ్యాంక్‌లు ఉపయోగించాలని, దెబ్బతిన్న బ్యాటరీలను ఛార్జింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

పశ్చిమాసియా ఘర్షణల్లో 22 మంది భారతీయుల మృతి

- మృతుల్లో 14 మంది నావికులు
- సౌదీ అరేబియాలో ముగ్గురు మృతి
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్

హైదరాబాద్, అక్టోబర్ 28, ఆశ్వి అప్డేట్స్:

పశ్చిమాసియాలో కొనసాగుతున్న సైనిక ఘర్షణలు భారతీయుల ప్రాణాలను బలిగొంటున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం, సౌదీ అరేబియా-హౌతీ తిరుగుబాటుదారుల మధ్య పోరు నేపథ్యంలో ఇప్పటివరకు 22 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మృతుల్లో 14 మంది నావికులు ఉన్నట్లు తెలిపింది. సౌదీ అరేబియాలో ముగ్గురు భారతీయులు మరణించినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు.

మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న పరిస్థితులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందని జైస్వాల్ పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామని, వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. ఫిబ్రవరి నుంచి పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల అనంతరం ఘర్షణలు విస్తృతమయ్యాయి. ప్రతీకారంగా సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్, కువైట్, ఖతార్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. హార్మూజ్ జలసంధిలో ప్రయాణించే నౌకలపైనా అమెరికా, ఇరాన్ దాడులు జరిగినట్లు సమాచారం.

మరోవైపు సౌదీ అరేబియా, యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. సౌదీ చమురు శుద్ధి కేంద్రాలు, విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుని హౌతీలు దాడులకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ పరిణామాలు గల్ఫ్ ప్రాంతంలో భద్రతా పరమైన ఆందోళనలను మరింత పెంచుతున్నాయి.

ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు

- ఢిల్లీలో 47.57 లక్షల ఓటర్ల పేర్ల తొలగింపుపై విచారణ
- ఫారం-6, 7, 8ల వినియోగంపై ఈసీకి ప్రశ్నలు
- చిరునామా మారిన వారికి మరో అవకాశం కల్పించాలని సూచన
- అభ్యంతరాల గడువు పొడిగిస్తామని ఈసీ హామీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 28, ఆశ్వి అప్డేట్స్:



ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై దాఖలైన పిటిషన్ల విచారణలో సుప్రీంకోర్టు ఎన్నికల సంఘం (ఈసీ) తీరుపై కీలక ప్రశ్నలు సంధించింది. ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి లక్షలాది మంది పేర్లను తొలగించే విషయంలో తగిన విచక్షణతో వ్యవహరించిందా అని ప్రశ్నించింది. ఇప్పటికే ఓటర్ల జాబితాలో పేర్లు ఉండి నివాసం మార్చుకున్న వారు మళ్లీ కొత్త ఓటర్లుగా ఫారం6 ఎందుకు సమర్పించాల్సి వస్తోందో వివరించాలని ఆదేశించింది. చిరునామా మార్పు కోసం ఉద్దేశించిన ఫారం8ను వినియోగించుకునే అవకాశం కల్పించాలని సూచించింది. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ గడువును పొడిగిస్తామని ఎన్నికల సంఘం ధర్మాసనానికి హామీ ఇచ్చింది. ఢిల్లీలో ఆగస్టు 31న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి 47.57 లక్షల మంది పేర్లను తొలగించారు. అంతకుముందు మొత్తం ఓటర్ల సంఖ్య 1.45 కోట్లుగా ఉండగా, అందు బాటులో లేనివారు, నివాసం మార్చుకున్నవారు, మరణించినవారు, ఒకటి కంటే ఎక్కువసార్లు పేర్లు నమోదు చేసుకున్నవారిగా తొలగింపులకు కారణాలు పేర్కొన్నారు. తొలుత సెప్టెంబర్ 30తో ముగియాల్సిన అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువును అక్టోబర్ 30 వరకు పొడిగించారు. అక్టోబర్ 26 నాటికి మ్యాపింగ్ సమస్యలు, ఇతర వ్యత్యాసాలకు సంబంధించి జారీ చేసిన 33.14 లక్షల నోటీసుల్లో 31.26 లక్షల కేసులను పరిష్కరించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. తార్కిక వ్యత్యాసాలున్నాయని గుర్తించిన 19.34 లక్షల కేసుల్లో 18.97 లక్షల కేసులపై చర్యలు పూర్తిచేసినట్లు వెల్లడించింది. ఫారం6 కింద 2.67 లక్షల దరఖాస్తులు, ఫారం7 కింద 20,074 అభ్యంతరాలు, ఫారం8 కింద 1.01 లక్షల దరఖాస్తులు అందాయి. తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 4న విడుదల చేయాలని నిర్ణయించింది.

విచారణ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఎన్యూమరేషన్ ఫారాలు అందించే సమయంలో ఇంట్లో లేని ఓటర్ల పరిస్థితిపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. నిర్దిష్ట గడువులో ఫారం సమర్పించలేదనే కారణంతో ఓటర్ల జాబితాలో తిరిగి పేరు నమోదు చేసుకునే అవకాశం నిరాకరించడం సమంజసమేనా అని ప్రశ్నించింది. ఫారం అందని వారు, నివాసం మార్చుకున్నవారు తమ పేర్లను తిరిగి చేర్చుకునేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేసే అవకాశం కల్పించాలని సూచించింది.

2026 ఓటర్ల జాబితాలో ఇప్పటికే పేరున్నవారు నివాసం మార్చుకున్నప్పుడు కొత్త ఓటర్లుగా ఫారం6 సమర్పించాలని ఎందుకు కోరుతున్నారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. చిరునామా మార్పు కోసం ఫారం 8ను ఎందుకు ఉపయోగించకూడదో వివరించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. ఫారం6, 7, 8లను చట్టం ప్రకారం నిర్దేశించారని, వాటి స్వరూపాన్ని ఇష్టానుసారం మార్చడం సాధ్యం కాదని జస్టిస్ బాగ్చి పేర్కొన్నారు. గడువులోగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించలేకపోయిన ఓటర్ల నుంచి అందుకు గల కారణాలను తెలుసుకునే మార్గాలను పరిశీలించాలని ధర్మాసనం సూచించింది.

నిరుద్యోగులకు మంత్రి పొంగులేటి జన్మదిన కానుక

- పీఎస్ఆర్ యువ నేస్తం పేరిట ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభం
- ఇప్పటివరకు లక్ష మందికి పైగా పేర్ల నమోదు
- ఏడాదిపాటు ఉచిత శిక్షణ.. అవసరమైతే గడువు పొడిగింపు
- గతంలో 2,300 మందికి శిక్షణ.. 462మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

హైదరాబాద్, అక్టోబర్ 28, ఆశ్వి అప్డేట్స్ :

రాష్ట్రంలోని నిరుద్యోగ యువత పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు పీఎసఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పీఎసఆర్ యువ నేస్తం పేరిట ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రతిష్టాత్మక ఆర్సీ ఎగ్జామ్స్ సంస్థ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈరోజు నుంచి ఏడాదిపాటు ఈ ఉచిత శిక్షణ ఉంటుందని, అవసరమైతే ఈ శిక్షణ కాలాన్ని పొడిగిస్తామని తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి పొంగులేటి ఈ కార్యక్రమాన్ని బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ అందించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. గత 30 ఏళ్లుగా ఆర్సీ ఎగ్జామ్స్ సంస్థ ఎంతోమంది ప్రతిభావంతులను తీర్చిదిద్దిందని, ఐఏఎస్ వంటి ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించేందుకు కూడా మార్గనిర్దేశం చేసిందని తెలిపారు. ఈ సంస్థలో కరీం, కృష్ణారెడ్డి, మేముల సైదులు వంటి అనుభవజ్ఞులైన అధ్యాపకులు శిక్షణలో భాగస్వాములుగా ఉండటం అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు.

గత అనుభవమే 'యువ నేస్తం'కు స్ఫూర్తి

2013లో రాజకీయాల్లోకి ప్రవేశించి 2014లో ఎంపీగా ఎన్నికైన అనంతరం 2016లో ఖమ్మం ప్రాంతంలో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మంత్రి గుర్తు చేశారు. అప్పట్లో సుమారు 2,300 మంది నిరుద్యోగులకు ఆఫ్‌లైన్‌లో శిక్షణ అందించడంతోపాటు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. శిక్షణ పొందిన వారిలో 462మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. ఉద్యోగాలు సాధించిన వారు తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేసిన సందర్భాలు తనను ఎంతగానో కదిలించాయని, వారి ఆనందాన్ని చూసి తన కళ్లలో నీళ్లు తిరిగాయని మంత్రి భావోద్వేగంగా అన్నారు. ఆ అనుభవమే మరింతమంది నిరుద్యోగ యువతకు శిక్షణ అందించాలనే సంకల్పానికి ప్రేరణగా నిలిచిందన్నారు.

ఇంటి వద్ద నుంచే నాణ్యమైన శిక్షణ

ప్రస్తుత ఆన్‌లైన్ శిక్షణ విధానం వల్ల అభ్యర్థులు హైదరాబాద్‌కు రాకుండానే తమ ఇళ్ల వద్ద నుంచే శిక్షణ పొందవచ్చని మంత్రి తెలిపారు. దూరప్రాంతాల్లో నివసించే యువతకు ప్రయాణ ఖర్చులు, వసతి తదితర ఇబ్బందులు లేకుండా ఈ విధానం ఉపయోగపడుతుందని చెప్పారు. ఒక్కో అభ్యర్థికి ఇలాంటి శిక్షణ అందించేందుకు సాధారణంగా కనీసం రూ.లక్ష ఖర్చవుతుందని, పుస్తకాలు, ఇతర శిక్షణ సామగ్రి కోసమే సుమారు రూ.14 వేల నుంచి రూ.30 వేల వరకు అయ్యే వ్యయాన్ని ట్రస్ట్ భరిస్తుందని స్పష్టం చేశారు.



లక్ష మందికిపైగా నమోదు..

ఎంతమందికైనా శిక్షణ

'పీఎస్ఆర్ యువ నేస్తం'పై తొలుత కొందరు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ ఉచిత శిక్షణ నిజంగానే అందిస్తున్నట్లు తెలుసుకున్న తర్వాత పెద్ద సంఖ్యలో యువత పేర్లు నమోదు చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు. ప్రకటన విడుదల చేసిన పది రోజుల్లోనే లక్ష మందికి పైగా అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవడం ఈ కార్యక్రమంపై యువత చూపుతున్న ఆసక్తికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమానికి ఎలాంటి కటాఫ్ తేదీ విధించలేదని, లక్ష మందితోనే పరిమితం కాకుండా ఎంతమంది అభ్యర్థులు వచ్చినా శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఏడాదిపాటు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని, అవసరమైతే పొడిగిస్తామని తెలిపారు.

త్వరలో మరో 15 వేల ఉద్యోగాల భర్తీ

రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. రెండేళ్లలో 72 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో సుమారు మరో 15 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. రానున్న కాలంలో మరిన్ని ఉద్యోగాల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్లు వెలువడనున్నాయని చెప్పారు.

దీపావళిలోగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఈరోజు కలిసిన సందర్భంలో పాత్రికేయుల ఇళ్ల స్థలాల అంశం చర్చకు వచ్చిందని మంత్రి పొంగులేటి తెలిపారు. రానున్న దీపావళి లోగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి సమ్మతించారని, దీనివల్ల దీర్ఘకాలిక సమస్య తీరుతుందని అన్నారు. దీనిపై విలేకరులు స్పందిస్తూ మంత్రి పుట్టిన రోజున తమకు శుభవార్త వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.

కోహ్లీని దాటేసిన అభిషేక్.. బద్దలైన రికార్డులు.. మరో రికార్డుకు 40 పరుగుల దూరం

- టీ20 ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన భారతీయుడిగా కోహ్లీ రికార్డు బద్దలు
- న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో 38 బంతుల్లోనే 113 పరుగుల విధ్వంసం
- ఒక టీ20 ఇన్నింగ్స్‌లో 10కి పైగా సిక్సర్లు మూడుసార్లు కొట్టిన తొలి ఫుల్-మెంబర్ దేశపు బ్యాటర్
- అత్యధిక టీ20 సెంచరీల జాబితాలో రోహిత్, సూర్యకుమార్‌ల సరసన రెండో స్థానం
- ఒకే ఏడాదిలో అత్యధిక టీ20 పరుగులు చేసిన సూర్యకుమార్ రికార్డుకు చేరువలో అభిషేక్

ఆశ్వి అప్డేట్స్

భారత స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో మంగళవారం జరిగిన మూడో టీ20లో కేవలం 38 బంతుల్లోనే 113 పరుగుల విధ్వంసకర సెంచరీతో చెలరేగాడు. ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో, టీ20 ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు (10) చేసిన భారత బ్యాటర్‌గా విరాట్ కోహ్లీని అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు.

199 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన అభిషేక్, వెల్లింగ్టన్ రీజనల్ స్టేడియంలో తనదైన శైలిలో సిక్సర్ల వర్షం కురిపించాడు. తన ఇన్నింగ్స్‌లో ఏకంగా 11 భారీ సిక్సర్లు, 9 ఫోర్లు బాదాడు. అతని మెరుపు వేగపు బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లు నిస్సహాయులుగా మిగిలిపోయారు. ఫలితంగా భారత్ ఆరు ఓవర్లకు పైగా మిగిలి ఉండగానే సునాయాసంగా విజయం సాధించింది.

ఈ ఇన్నింగ్స్‌తో అభిషేక్ పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక టీ20 అంతర్జాతీయ ఇన్నింగ్స్‌లో 10 లేదా అంతకంటే ఎక్కువ సిక్సర్లు కొట్టడం అతనికి ఇది మూడోసారి. ఐసీసీ పూర్తిస్థాయి సభ్య దేశాల నుంచి ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్ అభిషేకే కావడం విశేషం.

ఇంతకుముందు అతను రెండుసార్లు ఈ ఫీట్ సాధించి, వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్, ఆస్ట్రేలియా లెజెండ్ ఆరోన్ ఫించ్‌ల సరసన ఉన్నాడు. ఇప్పుడు వారిని దాటి ముందుకెళ్లాడు. టీ20 ఫార్మాట్‌లో ఒక ఇన్నింగ్స్‌లో 10కి పైగా సిక్సర్లు కొట్టడం అభిషేక్‌కు ఇది ఏడోసారి కాగా, ఈ విషయంలో అతని కంటే ముందు క్రిస్ గేల్ (18 సార్లు) మాత్రమే ఉన్నాడు.

టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అభిషేక్‌కు ఇది నాలుగో సెంచరీ. దీంతో అత్యధిక టీ20 సెంచరీలు సాధించిన ఆటగాళ్ల జాబితాలో రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, ఇంగ్లండ్ ఆటగాడు ఫిల్ సాల్ట్‌లతో కలిసి సంయుక్తంగా రెండో స్థానానికి చేరుకున్నాడు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్ (5 సెంచరీలు) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇప్పటి వరకు 70 టీ20 మ్యాచ్‌లు ఆడిన అభిషేక్, 69 ఇన్నింగ్స్‌లలో 33.43 సగటు, 196.83 స్ట్రైక్ రేట్‌తో 2,240 పరుగులు చేశాడు. ఇందులో 4 సెంచరీలు, 14 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఈ ఏడాదిలోనూ అభిషేక్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. 37 టీ20ల్లో 31.25 సగటు, 206.42 స్ట్రైక్ రేట్‌తో 1,125 పరుగులు సాధించాడు.

ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 పరుగులు చేసిన భారతీయుడిగా సూర్యకుమార్ యాదవ్ (2022లో 1,164 పరుగులు) పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టేందుకు అభిషేక్ కేవలం 40 పరుగుల దూరంలోనే ఉన్నాడు. అతని ప్రస్తుత ఫామ్ చూస్తుంటే, ఆ రికార్డు కూడా త్వరలోనే బద్దలవడం ఖాయంగా కనిపిస్తోంది.



టీ20 క్రికెట్‌లో భారత పేసర్ వరల్డ్ రికార్డు.. సరికొత్త చరిత్ర సృష్టించిన అర్ష్‌దీప్ సింగ్

- కివీస్‌తో మూడో టీ20లో అర్ష్‌దీప్ సింగ్ ప్రపంచ రికార్డు
- ఒకే క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక టీ20 వికెట్లు తీసిన బౌలర్
- ఐర్లాండ్ పేసర్ జాషువా లిటిల్ రికార్డును సమం చేసిన అర్ష్‌దీప్
- ఈ ఏడాది 39 వికెట్లతో అగ్రస్థానంలో నిలిచిన భారత పేసర్
- టీ20ల్లో 150 వికెట్ల మైలురాయికి ఒక్క వికెట్ దూరంలో అర్ష్‌దీప్



ఆశ్వి అప్డేట్స్

టీమిండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఒకే క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా ఐర్లాండ్‌కు చెందిన జాషువా లిటిల్ రికార్డును సమం చేశాడు. నిన్న వెల్లింగ్టన్‌లోని హెన్రీ స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ ఒక వికెట్ పడగొట్టాడు. దీంతో 2026 క్యాలెండర్ ఏడాదిలో అతను తీసిన మొత్తం వికెట్ల సంఖ్య 39కి చేరింది. 2022లో ఐర్లాండ్ పేసర్ జాషువా లిటిల్ కూడా ఒకే ఏడాదిలో 39 వికెట్లు పడగొట్టి రికార్డు సృష్టించాడు. ఇప్పుడు అర్ష్‌దీప్ ఆ రికార్డును సమం చేసి, పూర్తిస్థాయి సభ్యత్వం ఉన్న దేశాల బౌలర్ల లో అగ్రస్థానంలో నిలిచాడు.

2022లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ప్పటి నుంచి అర్ష్‌దీప్ సింగ్ భారత బౌలింగ్ దళంలో కీలక సభ్యుడిగా కొనసాగుతున్నాడు. ఇప్పటివరకు 102 టీ20 మ్యాచ్‌లు ఆడి 149 వికెట్లు పడగొట్టాడు. మరో వికెట్ తీస్తే 150 వికెట్ల మైలురాయిని అందుకుంటాడు. టీ20 ఫార్మాట్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కూడా అర్ష్‌దీప్ కొనసాగుతున్నాడు. ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో మూడు మ్యాచ్‌లలో కలిపి 4 వికెట్లు తీశాడు.

ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నం.1గా అభిషేక్.. నాలుగేళ్ల జడేజా ఆధిపత్యానికి బ్రేక్ వేసిన యాన్సెన్

- టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి అగ్రస్థానానికి అభిషేక్ శర్మ
- టెస్టు బౌలింగ్, ఆల్ రౌండర్ కేటగిరీల్లో నంబర్ 1గా మార్కో యాన్సెన్
- నాలుగేళ్ల తర్వాత టెస్ట్ ఆల్‌రౌండర్ నంబర్ 1 స్థానాన్ని కోల్పోయిన జడేజా
- టెస్ట్ బ్యాటింగ్‌లో రెండో స్థానానికి ఎగబాకిన దక్షిణాఫ్రికా కెప్టెన్ బవుమా
- వివిధ ఫార్మాట్లలో ర్యాంకులు మెరుగుపర్చుకున్న సంజూ, అర్ష్‌దీప్ సింగ్

ఆశ్వి అప్డేట్స్

ఐసీసీ తాజాగా విడుదల చేసిన తాజా ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. భారత యువ సంచలనం అభిషేక్ శర్మ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి అగ్ర స్థానాన్ని కైవసం చేసుకోగా, దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్ టెస్టుల్లో ఏకకాలంలో నంబర్ 1 బౌలర్‌గా, నంబర్ 1 ఆల్‌రౌండర్‌గా నిలిచి చరిత్ర సృష్టించాడు. తన కెరీర్‌లో ఈ రెండు కేటగిరీల్లోనూ యాన్సెన్ అగ్రస్థానానికి చేరడం ఇదే తొలిసారి.

ఆస్ట్రేలియాతో గెబెర్హాలో జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా విజయంలో యాన్సెన్ కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో 85 పరుగులు చేయడమే కాకుండా, ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఈ అద్భుత ప్రదర్శనతో టెస్ట్ బౌలింగ్ చార్టులో ఐదు స్థానాలు ఎగబాకి ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్‌ను అధిగమించాడు.

ఇక, ఆల్‌రౌండర్ల విభాగంలో యాన్సెన్ భారత స్టార్ రవీంద్ర జడేజాను వెనక్కి నెట్టి అగ్రపీఠాన్ని అధిరోహించాడు. గత నాలుగేళ్లకు పైగా జడేజానే టెస్ట్ ఆల్‌రౌండర్ల జాబితాలో నంబర్ 1గా కొనసాగుతుండటం గమనార్హం.

మరోవైపు, టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో టీ20ల్లో మళ్లీ సింహాసనాన్ని దక్కించుకున్నాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరిగిన మూడో టీ20లో కేవలం 35 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, మొత్తం 38 బంతుల్లో 113 పరుగులు సాధించాడు.

ఈ అద్భుత ఇన్నింగ్స్ ఫలితంగా సహచర ఆటగాడు ఇషాన్ కిషన్‌ను అధిగమించి తిరిగి నంబర్ 1 ర్యాంకును అందుకున్నాడు. అభిషేక్ తొలిసారిగా 2025 జులైలో ఈ ఘనత సాధించాడు. అలాగే సంజూ శాంసన్ ఆరు స్థానాలు ఎగబాకి 20వ ర్యాంకుకు చేరుకోగా, బౌలింగ్‌లో అర్ష్‌దీప్ సింగ్ 15వ స్థానానికి చేరాడు.

ఇక, టెస్ట్ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని రెండో ర్యాంకుకు చేరుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 179 పరుగులతో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలవడం అతనికి కలిసొచ్చింది. ఈ జాబితాలో ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ మాత్రమే అతని కంటే ముందున్నాడు.



క్రీడాలోకంలో విషాదం.. మూడుసార్లు పారా గేమ్స్ స్వర్ణ పతక విజేత నీరజ్ యాదవ్ బలవన్మరణం

- నివాసంలో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు నిర్ధారణ
- డోపింగ్ నిషేధంతో మానసిక ఒత్తిడికి గురైనట్లు సమాచారం
- ఢిల్లీ ఆసుపత్రిలో నీరజ్ మృతదేహానికి పోస్ట్‌మార్టం
- నీరజ్ మృతి చాలా దురదృష్టకరమన్న హెడ్ కోచ్ సత్యనారాయణ

ఆశ్వి అప్డేట్స్

భారత క్రీడా రంగంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆసియా పారా గేమ్స్‌లో మూడు స్వర్ణ పతకాలు సాధించి దేశ కీర్తిని పెంచిన స్టార్ అథ్లెట్ నీరజ్ యాదవ్ (42) ఆత్మహత్య చేసుకున్నాడు. ఢిల్లీలోని తన నివాసంలో బుధవారం విషం తీసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో భారత క్రీడాలోకం దిగ్భ్రాంతికి గురైంది. ప్రస్తుతం ఆయన మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఢిల్లీలోని ఆసుపత్రికి తరలించారు.

ఈ విషయాన్ని భారత పారాఅథ్లెటిక్స్ జట్టు హెడ్ కోచ్ ఎస్. సత్యనారాయణ ధ్రువీకరించారు. "నీరజ్ ఆత్మహత్య చేసుకోవడం చాలా దురదృష్టకరం. ఇలా జరగడం బాధాకరం" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఆసియా పారా గేమ్స్‌కు డోపింగ్ నిషేధం కారణంగా నీరజ్ యాదవ్ అర్హత కోల్పోయారు. ఈ కారణంగానే ఆయన తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై ఈ తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే, ఆయన ఆత్మహత్యకు దారితీసిన కచ్చితమైన కారణాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. కోచ్ సత్యనారాయణ మాట్లాడుతూ.. "ఆయన ఆత్మహత్యకు కారణం ఇదేనని నేను కచ్చితంగా చెప్పలేను. కానీ, ఒక క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకరించగలగాలి. ఆయన ఇలాంటి తీవ్ర నిర్ణయం తీసుకోవడం విచారకరం" అని వ్యాఖ్యానించారు.

భారత్‌కు చెందిన ప్రతిభావంతులైన పారా అథ్లెట్లలో నీరజ్ యాదవ్ ఒకరు. 2018 జకార్తా ఆసియా పారా గేమ్స్‌లో జావెలిన్ త్రోలో స్వర్ణం సాధించాడు. 2023లో హాంగ్‌జౌలో జరిగిన క్రీడల్లో జావెలిన్ త్రో, డిస్కస్ త్రో విభాగాల్లో రెండు స్వర్ణ పతకాలు గెలిచి చరిత్ర సృష్టించాడు. ఏడేళ్ల వయసులో పోస్టోపోలియో రెసిడ్యువల్ ప్యారాలిసిస్‌కు గురైన నీరజ్, మొదట వీల్‌చైర్ టెన్నిస్‌లో రాణించి, ఆ తర్వాత పారాఅథ్లెటిక్స్‌లోకి అడుగుపెట్టాడు. అతడు F55 కేటగిరీలో (సీటెడ్ షాట్ పుట్, డిస్కస్, జావెలిన్) పోటీ పడుతూ అంతర్జాతీయ వేదికలపై దేశానికి గర్వకారణంగా నిలిచాడు.



భారత్, యాషెస్ సిరీస్‌లతో క్రికెట్ ఆస్ట్రేలియాకు రికార్డు స్థాయి ఆదాయం!

- గతేడాది నష్టాల నుంచి ఈసారి భారీ లాభాల్లోకి
- భారత్, యాషెస్ సిరీస్‌లతో కాసుల వర్షం
- వచ్చే రెండేళ్లు నష్టాలు తప్పవని అంచనా
- మహిళల టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకున్న ఆసీస్ జట్టు

ఆశ్వి అప్డేట్స్

క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఆర్థికంగా భారీ విజయాన్ని నమోదు చేసింది. 202526 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 601.1 మిలియన్ల ఆస్ట్రేలియా డాలర్ల (సుమారు 423 మిలియన్ డాలర్లు) ఆదాయాన్ని, 81.8 మిలియన్ల ఆస్ట్రేలియన్ డాలర్ల(57 మిలియన్ డాలర్లు) నికర మిగులును సాధించింది. భారత్‌తో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్, ఇంగ్లండ్‌తో జరిగిన ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌ల మీడియా హక్కుల ద్వారా ఈ భారీ ఆదాయం సమకూరినట్లు సీఏ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో 11.3 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్ల నష్టాన్ని నమోదు చేసిన సీఏ, ఈసారి రికార్డు లాభాలను ప్రకటించడం విశేషం.

ఈ ఏడాది అంతర్జాతీయ సీజన్‌లో వాణిజ్యపరంగా బలమైన ప్రదర్శన, రికార్డు స్థాయి ప్రేక్షకాదరణ లభించిందని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. ముఖ్యంగా, ఇంగ్లండ్‌తో స్వదేశంలో జరిగిన యాషెస్ టెస్టు సిరీస్‌కు ప్రేక్షకులు పోటెత్తారు. 18 రోజుల పాటు సాగిన ఈ సిరీస్‌ను మొత్తం 8,59,580 మంది వీక్షించారు. ఈ సిరీస్‌ను ఆస్ట్రేలియా 41 తేడాతో గెలుచుకుంది. మరోవైపు, ఆస్ట్రేలియా మహిళల జట్టు లార్డ్స్‌లో ఇంగ్లండ్‌ను ఓడించి ఏడోసారి ఐసీసీ టీ20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. గత ఏడాది అక్టోబర్‌నవంబర్‌లో భారత్‌తో జరిగిన సిరీస్‌లో ఆసీస్ వన్డేలను 21తో గెలుచుకోగా, టీ20 సిరీస్‌ను భారత్ 21తో దక్కించుకుంది.

అయితే, ఈ లాభాల జోరు రాబోయే రెండేళ్ల పాటు కొనసాగకపోవచ్చని క్రికెట్ ఆస్ట్రేలియా అంచనా వేస్తోంది. అంతర్జాతీయ టూరింగ్ షెడ్యూల్ కారణంగా మీడియా హక్కులు, మ్యాచ్‌ల ద్వారా వచ్చే ఆదాయం తగ్గే అవకాశం ఉండటంతో 202627, 202728 ఆర్థిక సంవత్సరాల్లో నష్టాలు రావొచ్చని పేర్కొంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా పురుషుల జట్టు టెస్టు సిరీస్ కోసం దక్షిణాఫ్రికాలో పర్యటిస్తోంది. ఆ తర్వాత నవంబర్ 13 నుంచి ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్, డిసెంబర్ 9 నుంచి న్యూజిలాండ్‌తో నాలుగు టెస్టుల సిరీస్ ఆడనుంది. అనంతరం జనవరి 21 నుంచి భారత్‌లో ఐదు టెస్టుల సిరీస్‌లో పాల్గొననుంది.



మనసుకు దగ్గరైన సినిమా ఇది..



లేడీ సూపర్ స్టార్ నయనతార ప్రధాన పాత్రలో నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ డివోషనల్ కామెడీ మూవీ 'మూకుత్తి అమ్మన్-2'. ఈ సినిమా 2020లో వచ్చి విజయవంతమైన 'మూకుత్తి అమ్మన్'కు సీక్వెల్‌గా రాబోతుండటంతో ప్రేక్షకుల్లో భారీ హైప్ క్రియేట్ అయింది. అగ్ర దర్శకుడు సుందర్ సి ఈ చిత్రానికి తెరకెక్కిస్తుండగా, ఐషారీ కె గణేష్ నిర్మిస్తున్నారు. మొదటి భాగంలో మెప్పించిన నయనతార మళ్లీ అదే రోల్‌లో నటిస్తుండటంతో పాటు, ఇందులో రెజినా కేసాండ్రా, ఖుష్బూ స్నేహ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ నవంబర్ 6న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, నయనతార సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ నోట్ షేర్ చేశారు. కొన్ని సినిమాలు కెమెరాలు ఆఫ్ అయిన తర్వాత కూడా మన మనసులోనే ఉండిపోతాయని, తన కెరీర్‌లో 'మూకుత్తి అమ్మన్ 2' అలాంటి ప్రత్యేకమైన ప్రాజెక్ట్ అని తెలిపారు. ఈ మూవీ కోసం ఆయన అందించిన విజన్, ప్రేమ, ప్యాషన్‌కు దర్శకుడు సుందర్ సికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో కలిసి పనిచేయడం నిజంగా ఒక మంచి అనుభూతిని ఇచ్చిందని, ప్రతీ సన్నివేశాన్ని ఎంతో కేర్ తీసుకుని డిజైన్ చేసి ఈ జర్నీని ఇంత గుర్తుండిపోయేలా చేసినందుకు ఆయనకు ఎల్లప్పుడూ కృతజ్ఞతురాలినై ఉంటానని పేర్కొన్నారు. అలాగే ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో నమ్మి సపోర్ట్ చేసిన ప్రొడ్యూసర్ ఐషారీ కె గణేష్‌కి కూడా థ్యాంక్స్ చెప్పారు. కథను మనస్ఫూర్తిగా నమ్మే ప్రొడ్యూసర్ ఉండటం వల్ల ఈ జర్నీ మరింత అర్థవంతంగా మారిందని అన్నారు. తోటి నటీమణులు ఖుష్బూ స్నేహలతో కలిసి ఈ సినిమాలో నటించడం నేనెప్పటికీ గుర్తుంచుకుంటానని చెబుతూ వాళ్లకు తన ప్రేమాభిమానాలను తెలియజేశారు. చివరగా, ఒక అద్భుతమైన టీమ్‌తో పనిచేసినందుకు అదృష్టంగా భావిస్తున్నానని, ఈ సినిమాతో తాము క్రియేట్ చేసిన డివోషనల్ ప్రపంచాన్ని థియేటర్లలో చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని స్పష్టం చేశారు.



బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీ ఖాన్ ముద్దుల కూతురు సారా అలీ ఖాన్ .. 2018లో వచ్చిన రొమాంటిక్ డ్రామా 'కేదార్‌నాథ్'తో కుర్రకారు మనసు దోచుకుంది. తొలి సినిమాతోనే తిరుగులేని క్రేజ్ సొంతం చేసుకుని, ఏడాదికి ఒక్క సినిమాతోనైనా థియేటర్లలో రచ్చ చేస్తోంది. ఇటీవల 'ఉడ్తా తీర్'తో అలరించిన ఈ భామ, మరికొద్ది రోజుల్లో ఇండస్ట్రీలో ఎనిమిదేళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకోబోతోంది. ఈ క్రమంలోనే బాలీవుడ్‌లో ఎప్పుడూ హాట్ టాపిక్‌గా మారే నెపోటిజం వివాదంపై సారా మైండ్ బ్లాకింగ్ కామెంట్స్ చేసింది. తన వెనుక పెద్ద సినీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నప్పటికీ, కెరీర్‌లో తాను వేసిన ప్రతీ అడుగు సొంత నిర్ణయమేనని సారా తెగేసి చెప్పింది. తన కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతూ, కాంట్రాక్ట్‌ల గురించి మాట్లాడుతూ, సినిమాల్లో నన్ను తీసుకోమని ఎవరినీ ప్రాధేయపడే నాన్న తనకు లేరని, తాను పూర్తిగా అమ్మ పెంపకంలోనే పెరిగానంటూ సంచలన విషయాలు బయటపెట్టింది.

తొలి సినిమా 'కేదార్‌నాథ్' సమయంలో వివాదాలు, సమస్యలు ఎదురైనప్పుడు కూడా సొంతంగా ఫేస్ చేసి క్లియర్ చేసుకున్నానని గుర్తుచేసుకుంది. స్టార్ కిడ్‌గా పుట్టడం వల్ల ఆరంభంలో అవకాశాలు త్వరగా రావడం నిజమేనైనా, అదే పనిగా తమపై నెపోటిజం అనే ముద్ర వేసి పడే కష్టాన్ని తక్కువ చేసి చూడటం అస్సలు సరికాదని మండిపడింది. ఎవరు ఏ ఇంట్లో పుట్టాలనేది ఎవరి చేతిలోనూ ఉండదని, తనలాగే జాన్వీ కపూర్, అనన్యా పాండే కూడా తమ సొంత టాలెంట్‌ను నమ్ముకునే ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి నానా తంటాలు పడుతున్నారని క్లారిటీ ఇచ్చింది. ఎనిమిదేళ్లుగా ఇండస్ట్రీలో ఉంటూ ప్రేక్షకులను మెప్పిస్తున్న తాను.. ప్రతిసారీ తన అర్హతను, స్థానాన్ని నిరూపించుకోవాల్సిన అవసరం లేదంటూ గట్టి కౌంటర్ ఇచ్చింది.

నెపోటిజం ముద్ర వేసి మా కష్టాన్ని తక్కువ చేయకండి..



విదేశీ టీమ్‌తో పనిచేయడం ఒక కొత్త అనుభూతి..

బాలీవుడ్ యంగ్ బ్యూటీ సయామీ ఖేర్ అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. ప్రముఖ దర్శకుడు మాక్సిమ్ కుజ్నెత్సోవ్ తెరకెక్కిస్తున్న ఒక ఇండో-రష్యన్ డ్రామా చిత్రంలో ఆమె కీలక పాత్రకు ఎంపికయ్యారు. రష్యా, భారత్ వ్యాప్తంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ భారీ చిత్రాన్ని కార్తీనా ఎంటర్‌టైన్‌మెంట్, వైట్ నైట్ ఫిల్మ్స్, విష్ మీడియా బ్యానర్స్‌పై సంయుక్తంగా నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా విశేషాలను తాజాగా, ఓ ఇంటర్వ్యూలో సయామీ ఖేర్ పంచుకున్నారు. విదేశీ చిత్రబృందంతో కలసి పనిచేయడం తనకు పూర్తిగా కొత్త, విభిన్నమైన అనుభూతిని ఇచ్చిందని ఆమె తెలిపారు. మొదటిసారి రష్యాకు వెళ్లానని, మాస్కో నగరం ఎంతో అందంగా ఉందని ఆమె ప్రశంసించారు. మన దగ్గర ఉండే వాతావరణానికి, అక్కడ పనిచేసే విధానానికి చాలా తేడా ఉందని, ఈ అంతర్జాతీయ కలసికట్టు ప్రయాణం తనకు ఎంతగానో నచ్చిందని చెప్పారు.

భవిష్యత్తులో ఇలాంటి గ్లోబల్ ప్రాజెక్ట్‌లు మరిన్ని చేయాలని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. సరిహద్దులు, భాషా సరిహద్దులను దాటి పనిచేయడం ఎంతో సరదాగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. వేర్వేరు సంస్కృతుల నుంచి వచ్చిన వ్యక్తులతో పనిచేసినప్పుడు కథను చెప్పే విధానంలో కొత్త కోణం కనిపిస్తుందని, సినిమాను తమదైన ప్రత్యేక శైలిలో రూపొందించే వ్యక్తుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చని ఆమె అన్నారు. ఈ చిత్రంలో భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నానని, ప్రాజెక్ట్ వివరాలు ఇప్పుడే చెప్పడం తొందరపాటే అయినప్పటికీ, ఇది ఒక బలమైన మహిళా ప్రధాన పాత్ర చుట్టూ తిరిగే కథ అని సయామీ స్పష్టం చేశారు.

తెరపై 'ఈరా' మ్యాజిక్‌కు వేళాయే!

ప్రసవానంతరం కూడా కాలికి గజ్జెకట్టి ప్రదర్శన ఇచ్చి ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించిన.. ప్రముఖ జానపద కళాకారిణి విఠాబాయి జీవిత ప్రయాణాన్ని తెరపై కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నట్లు 'ఈరా' చిత్ర టీజర్‌తో ఇటీవలే స్పష్టం చేసింది ఆ సినీబృందం. ఇందులో ప్రధాన పాత్రధారిగా బాలీవుడ్ అందాల తార శ్రద్ధా కపూర్ నటిస్తున్నారు. ఆగస్టులోనే విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడి డిసెంబరు 4న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ బయోపిక్ ట్రైలర్ విడుదల తేదీని తాజాగా ఇన్‌స్టాలో అధికారికంగా ప్రకటించారు శ్రద్ధ. 'ఈ శుక్రవారం అసలు సిసలైన మ్యాజిక్ చూడబోతున్నారు. అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతం కానుంది' అనే క్యాప్షన్‌ని పేర్కొన్నారు. ఈ మేరకు చీకటిలో కిక్కిరిసిన భారీ జనసమూహం లాంతర్లను పట్టుకుని ఆసక్తిగా నృత్యం కోసం ఎదురుచూస్తున్న వీడియోను పంచుకున్నారు.



రామాయణతో ఓ గొప్ప అవకాశం దక్కిం


రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకుడు. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. తాజాగా లాస్ ఏంజెలెస్‌లోని అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌లో ఈ మూవీ ప్రపంచ ప్రీమియర్ షోని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యశ్ మాట్లాడుతూ.. పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఎక్కడ మొదలయ్యాం అనే దాన్నిబట్టి ఎక్కడివరకు వెళ్లగలం అనేది నిర్ణయించలేం. మూలాలను మర్చిపోకుండా ముందుకు సాగాలి. భారతీయ సినీ పరిశ్రమలో భాగమైనందుకు గర్వపడుతున్నా. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప అవకాశం నాకు ఈ సినిమాతో దక్కింది" అని యశ్ వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో ఆయన రా పాత్రను పోషించడంతోపాటు, నమిత్ తో కలిసి సహ నిర్మాతగా వ్యవహరిస్ ఇక, 'రామాయణ' ప్రీమియర్ వేడుక బంధించిన వీడియోలు ప్రస్తుతం సా మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. రెడ్ క యశ్, రణ్‌బీర్ కపూర్ ఒకరినొకరు ఆత్మీ ఆలింగనం చేసుకోవడం అభిమానులను కుంటోంది. సాయిపల్లవి (Sai pallavi దాయ వస్త్రధారణతో వేడుకలో ప్రత్యేక ఆ నిలిచారు. నితేశ్ తివారీ, నమిత్ మల్హోత్రా లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నవం ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కా



నా ఎదుగుదలను తట్టుకోలేకే నాపై లేనిపోని పుకార్లు సృష్టిస్తున్నారు

స్టార్ హీరోయిన్ తాప్సీ పన్ను లేడీ ఓరియంటెడ్ సినిమాలు, సస్పెన్స్ థ్రిల్లర్లతో పాటు కమర్షియల్ చిత్రాల్లో నటిస్తూ తనదైన మార్క్ చూపించారు. ఎలాంటి సినీ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా సొంత కష్టంతోనే స్టార్ పొజిషన్‌కు చేరుకున్నారు. వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఈ భామ.. తాజాగా, ఇండస్ట్రీలో తాను ఎదుర్కొన్న వివక్షపై సంచలన వ్యాఖ్యలు చేసింది. తన వెనుక ఏ బ్యాక్‌గ్రౌండ్ లేకపోవడం వల్లే తన ఎదుగుదలను ఇండస్ట్రీలోని కొంతమంది అస్సలు తట్టుకోలేకపోతున్నారని ఫైర్ అయింది. ముఖ్యంగా బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ సరసన 'డంకీ' సినిమాలో లీడ్ రోల్ ఆఫర్ వచ్చినప్పుడు ఇండస్ట్రీ వర్గాలు షాక్ అయ్యాయని తాప్సీ గుర్తుచేసుకుంది. తన వెనుక ఫలానా స్టార్ ఫ్యామిలీ ఉందనో, గాడ్‌ఫాదర్ ఉన్నాడనో, ఒక పెద్ద స్టూడియో సపోర్ట్ ఉందనో చెప్పుకోవడానికి ఏమీ లేదని స్పష్టం చేసింది. అందుకే 'డంకీ' ఆఫర్ రాగానే అసలు ఈమెకి ఛాన్స్ ఎలా వచ్చిందంటూ అందరూ వింతగా చూశారని చెప్పింది. తనకు షారూఖ్ సోషల్ సర్కిల్‌తో పరిచయాలు లేవని, డైరెక్టర్ రాజ్‌కుమార్ హిరానీతో అంతకుముందు పనిచేయలేదని వెల్లడించింది.

ఒక సినిమాలో తన పెర్ఫార్మెన్స్ నచ్చి హిరానీ ఆఫీస్‌కు పిలిపించారని, ఆ తర్వాత 'డంకీ' కథ వినిపిస్తా అని అడగ్గానే తాను నమ్మలేకపోయానని తెలిపింది. 'డంకీ'లో నటించే అవకాశం తనకు వచ్చినప్పుడు అందరూ షాక్ అయ్యారని వెల్లడించింది. పరిచయాలు లేని తాను ఆ ప్రాజెక్ట్‌లోకి రావడాన్ని చాలామంది తట్టుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేసింది. "నన్ను ఎవరూ ఒక మూస పద్ధతిలో ఇరికించలేరు. ఎవరికీ పెద్దగా నా వ్యక్తిగత విషయాలు తెలియకపోవడం వల్లే నా గురించి ఇష్టం వచ్చినట్లు తప్పుడు ప్రచారాలు చేశారు. 'ఈమెతో పనిచేయడం చాలా కష్టం, ఆమెతో ఎవరూ పని చేయాలనుకోరు, రకరకాల సమస్యలు ఉన్నాయి' అంటూ కావాలనే నాపై అసత్య కథలు అల్లారు" అని మండిపడింది. ఎలాంటి అండదండలు లేకుండా కేవలం తన టాలెంట్‌ను నమ్ముకుని ఇండస్ట్రీలో నిలబడినందుకు తనకు ఎంతో గర్వంగా ఉందని తాప్సీ తేల్చిచెప్పింది.



జీవితంలో అత్యంత ఘోరమైన సమయంలో అండగా నిలిచింది అత



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ తన వ్యక్తిగత జీవితం గురించి, ముఖ్యంగా శిఖర్ పహారియాతో ఉన్న అనుబంధం గురించి 'కాఫీ విత్ కరణ్' టాక్ షోలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తన జీవితంలో ఎదురైన అత్యంత కష్టసమయంలో శిఖర్ తనను ఏ విధంగా సపోర్ట్ చేశాడో గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయింది. 2018లో తల్లి, అతిలోక సుందరి శ్రీదేవి హఠాన్మరణం చెందినప్పుడు తాము ఎదుర్కొన్న దారుణమైన పరిస్థితులను ఈ వేదికపై పంచుకుంది. లండన్‌లో చదువుకుంటున్న శిఖర్ పహారియా తన చదువును అర్ధాంతరంగా ఆపేసి ముంబైకి వచ్చేశాడని వెల్లడించింది. తనకు ఎప్పుడు ఏ అవసరం వస్తుందో, తాను ఎక్కడ ఒంటరైపోతానో అని భయపడి జుహులోని తన స్నేహితుడి ఇంట్లోనే నెల రోజుల పాటు రహస్యంగా ఉన్నాడనే విషయం తనకు చాలా కాలం తర్వాత తెలిసిందని చెబుతూ ఎమోషనల్ అయ్యింది.

తల్లిని కోల్పోయిన ఆ ఘోరమైన సమయంలో చెల్లెలు ఖుషీ కపూర్ తన ఏడుపును ఆపేసి తనకు ధైర్యం చెప్పి తీరును కూడా జాన్వీ 'కాఫీ విత్ కరణ్' షోలో గుర్తు చేసుకుంది. శిఖర్ పహారియా, జాన్వీ కపూర్ గత కొన్నేళ్లు ప్రేమలో ఉన్నప్పటికీ తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించలేదు. అయితే చాలా ఇంటర్వ్యూలలో తన జీవితం శిఖర్ పాత్ర ఎంత ముఖ్యమైందో ఆమె చెబుతూనే వస్తోంది. ఇక సినిమాల విషయానికి వస్తే, జాన్వీ ఇటీవల రామ్ చరణ్ సరసన 'పెద్ది' సినిమాలో నటించి అలరించగా, తదుపరి టైగర్ ష్రాఫ్, లక్ష్యలతో కలిసి 'లగ్ జా గలే' సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా 2027 మే 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

నిద్ర పట్టడం లేదా.. ఈ డ్రింక్స్ ట్రై చేయండి

ఈ రోజుల్లో నిద్రపట్టకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఆఫీసులో తీవ్ర ఒత్తిడిలో పనిచేసి ఇంటికొస్తే.. ఇంట్లో కూడా సరైన నిద్రపట్టకపోతే నరకంలా ఉంటుంది. ఇక సరైన నిద్రలేకపోతే అనేక ఇతర అనారోగ్య సమస్యలు కూడా వస్తుంటాయి. అందుకే నిద్ర పట్టాలంటే కొన్ని డ్రింక్స్ సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ డ్రింక్స్ ఏమిటో ఇప్పుడు చూసేద్దాం..



లావెండర్ టీ

లావెండర్ మంచి సువాసనను కలిగి ఉంటుంది. ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో సాయపడుతుంది. నిద్రకు ముందు లావెండర్ టీ తాగడం వల్ల మనస్సు, శరీరానికి విశ్రాంతి లభిస్తుంది. తద్వారా మంచి నిద్ర పడుతుంది. నిద్రకు ఒక గంట ముందు ఈ టీని తీసుకోవడం మంచిది. లావెండర్ టీ కూడా యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంది. జీర్ణ సమస్యలను తగ్గించడంలో అద్భుతంగా సాయపడుతుంది.

పిప్పరమింట్ టీ

పిప్పరమింట్ టీ రిఫ్రెష్‌గా ఉండటమే కాదు.. మీ కండరాలను రిలాక్స్ చేయడంలో సాయపడుతుంది. అలాగే, టెన్షన్‌ను తగ్గించగలదు. తద్వారా మంచి నిద్ర పడుతుంది. నిద్రపోయే ఒక గంట ముందు సాయంత్రం ఈ టీని సేవించడం ఉత్తమం. పిప్పరమింట్ టీ కూడా జీర్ణక్రియకు సాయపడుతుంది. ప్రేగు సిండ్రోమ్ లక్షణాలను కూడా తగ్గిస్తుంది.





అశ్వగంధ టీ

అశ్వగంధ అనేది అడాప్టోజెనిక్ హెర్బ్. శరీరంలో ఒత్తిడిని తగ్గించి విశ్రాంతిని కలిగిస్తుంది. కార్టిసాల్ స్థాయిలను తగ్గించే గుణాలను కలిగి ఉంటుంది. ఒత్తిడికి సంబంధించిన హార్మోన్, మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది. నిద్రవేళకు ఒక గంట ముందు సాయంత్రం సమయంలో ఈ అశ్వగంధ టీని సేవించడం ఉత్తమం. అశ్వగంధ టీ మానసిక స్థితిని మెరుగుపరచడంలో అద్భుతంగా

అల్లం టీ

అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, డైజెస్టివ్ గుణాలు ఉన్నాయి. కండరాలను రిలాక్స్ చేయడంతో పాటు మంచి నిద్రను ప్రేరేపిస్తుంది. నిద్రించే ముందు అల్లం టీ తాగడం వల్ల అజీర్ణం, ఉబ్బరం తగ్గుతుంది. ప్రశాంతమైన నిద్ర పోవచ్చు. నిద్రకు ఒక గంట ముందు సాయంత్రం ఈ అల్లం టీని సేవించాలి. అల్లం టీ కూడా వికారం తగ్గించడంతో పాటు రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సాయపడుతుంది.





పసుపు పాలు

పాలు, దాల్చినచెక్క, అల్లం వంటి ఇతర సుగంధ ద్రవ్యాలతో పసుపు కలపాలి. అప్పుడు గోల్డెన్ మిల్క్ మాదిరిగా మారుతాయి. పసుపులో కర్కుమిన్ ఉంటుంది. మంచి నిద్రను అందిస్తుంది.ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఉంటాయి. నిద్రపోయే ముందు ఈ పసుపు పాలు తాగడం వల్ల వాపు తగ్గుతుంది. నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది. నిద్రించే ఒక గంట ముందు ఈ పసుపు పాలను సేవించడం ఉత్తమం. జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సాయపడుతుంది.

స్కిన్ క్యాన్సర్.. లక్షణాలు ఇవే..!

ఇటీవల క్యాన్సర్ బారిన పడేవారి సంఖ్య పెరుగుతోంది. స్కిన్ క్యాన్సర్ డేంజర్ బెల్స్ కూడా మోగుతున్నాయి. ఏ క్యాన్సర్ అయినా ప్రారంభదశలో గుర్తిస్తే నయం చేసుకోవచ్చు. అసలు స్కిన్ క్యాన్సర్ లక్షణాలు ఏమిటో ఈ కథనంలో తెలుసుకుందాం.. చాలా మంది పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా స్కిన్ క్యాన్సర్ కేసులు ఎక్కువవుతున్నాయ్.



పుట్టుమచ్చలు రంగు మారుతున్నాయా?

కొందరిలో ఉన్నట్టుండి పుట్టుమచ్చల కలర్ మారుతూ ఉంటుంది. సైజు, రంగు కూడా మారుతుంటాయి. ఇలా జరిగితే పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరని డాక్టర్లు చెబుతున్నారు. అమెరికాలో చర్మవ్యాధికి సంబంధించిన అమెరికాన్ అకాడమీ ఆఫ్ డెర్మటాలజీ విభాగం వారు స్కిన్ క్యాన్సర్‌కు సంబంధించిన లక్షణాలపై స్పష్టతనిచ్చారు. 30 ఏళ్ల తరువాత చర్మంపై ఏదైనా మచ్చ వచ్చి అది క్రమంగా పెరగడం లేదా దాని రంగులో మార్పు రావడం జరుగుతుందంటున్నారు. కొత్త పుట్టుమచ్చలు వస్తే దా1నికి అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు. చర్మంపై ఎప్పుడు కొత్తగా పుట్టుమచ్చలు వచ్చినా వాటిని గమనిస్తూనే ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చర్మంపై చిన్న కురుపులా వచ్చి అది ఎన్ని రోజులైనా మానకపోతే వైద్యులను వెంటనే అప్రమత్తమై వైద్యులను సంప్రదించాలి. బాసల్ సెల్ కార్సినోమా, స్క్వామోస్ సెల్ కార్సినోమాలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయంటున్నారు.

దురద, దుద్దుర్లు

స్కిన్ క్యాన్సర్ వచ్చినట్టయితే చర్మం ఎక్కువగా దురదపెడుతుంది. కొన్ని ప్రదేశాల్లో దద్దుర్లు వస్తాయ్. సాధారణంగా చర్మంపై కురుపులు వచ్చినా దద్దుర్లు వచ్చినా కొన్ని రోజుల్లో తగ్గిపోతాయ్. ఒక వేల ఎంతకీ తగ్గకపోతే అప్పుడు అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టాలని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

డైవర్స్ కు కారణాలివే..

ఇటీవల భార్యాభర్తలు విడాకులు తీసుకోవడం వెరీ కామన్ అయిపోయింది. చాలా సిల్లీ రీజన్స్ తో విడిపోయేవారూ ఉన్నారు. బలమైన కారణాలతోనూ దూరమయ్యేవారూ ఉన్నారు. అయితే ముఖ్యంగా ఐదు కారణాల వల్ల భార్యాభర్తలు విడిపోతున్నారని మానసిక విశ్లేషకులు చెబుతున్నారు. ఆ కారణాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..



కమ్యూనికేషన్ గ్యాప్

చాలా జంటలు కేవలం ఒకరితోఒకరు మనసువిప్పి మాట్లాడుకోకపోవడం వల్లే విడిపోతున్నారట. ఒకరి భావాలు మరొకరు అర్థం చేసుకోకపోవడం.. భావాలను వ్యక్తపరుచుకోకపోవడం వల్ల ఒకరిని మరొకరు అర్థం చేసుకోవడంలో ఫెయిల్ అవుతున్నారంట. కమ్యూనికేషన్ గ్యాప్ విడాకులకు ప్రధాన కారణం అవుతున్నదని తెలుస్తోంది.

పరస్పర గౌరవం లేకపోవడం

భార్యాభర్తల మధ్య ఒకరిమీద మరొకరికి గౌరవం ఉండాలి. లేదంటే ఆ సంబంధం ఎక్కువ కాలం నిలబడదు. చాలా డివోర్స్ కేసుల్లో ఒకరిమీద ఒకరికి గౌరవం లేకపోవడం కూడా ఓ కారణంగా తెలుస్తోంది.

ఆర్థిక అభద్రత

డబ్బు విషయంలో భార్యాభర్తల మధ్య నిరంతరం తగాదాలు, ఖర్చులు సరిపోకపోవడం, ఆర్థిక లక్ష్యాలను చేరుకోలేకపోవడం - ఇవన్నీ ఇద్దరు వ్యక్తుల మధ్య చాలా ఉద్రిక్తతను పెంచుతాయి, తద్వారా సంబంధాన్ని కాపాడుకోవడం కష్టం అవుతుంది.

కుటుంబ జోక్యం

భార్యాభర్తల మధ్య విబేధాలు రావడానికి కుటుంబసభ్యుల అతి జోక్యం కూడా ఓ కారణం అవుతోంది. భార్య తరపు వాళ్లు, లేదంటే భర్త తరపు వాళ్లు.. ఇలా ఇద్దరి తరపు వాళ్లు విబేధాలకు కారణం అవుతున్నారు. భార్య ప్రతి విషయానికి తన తల్లి లేదా సోదరి మీద ఆధారపడటం.. భర్త సైతం ప్రతి విషయానికి తన తల్లిదండ్రుల మీద డిపెండ్ అవ్వడం.. వాళ్లు కూడా అతి జోక్యం చేసుకుంటుండటంతో విబేధాలు తారస్థాయికి చేరుతున్నాయి. వీరి వ్యవహారశైలి కూడా

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S